ఒంటిమిట్ట కోదండరాముడిని దర్శించుకున్న కలెక్టర్ లోతేటి శివశంకర్



కోదండరామాలయంలో కడప కలెక్టర్

ఒంటిమిట్ట, జూలై 6: ఏకశిలానగిరి కోదండరామాలయాన్ని కడప జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కుటుంబసభ్యులతో కలిసి శనివారం ఉదయం దర్శించుకున్నారు. నూతనంగా కలెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న ఆయన రాష్ట్ర గుర్తింపు పొందిన కోదండరామాలయాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన కడప జిల్లాకు కలెక్టర్‌గా రావడం తన పూర్వజన్మ సుకృతమని, కడప జిల్లా ప్రజలకు తన శక్తివంచన లేకుండా సేవ చేస్తానని, జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తానన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఆలయాన్ని దర్శించుకుని బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్‌కు టీటీడీ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు వీణారాఘవాచార్యులు, ఇన్‌స్పెక్టర్ నవీన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వే

● వైద్యాధికారుల శిక్షణలో డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

రాయచోటి టౌన్, జూలై 6: ఇంటింటా కుష్టు వ్యాధి గ్రస్తుల సర్వే పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య సూచించారు. శనివారం రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురంలో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లాలోని వివిధ పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు ఇంటింట కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఐటీ ఇండియా సెక్రటరీ డాక్టర్ శివకుమార్ వైద్యులకు ఎల్‌సీడీసీ (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్)పై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింట కుష్టు వ్యాధి సర్వే ఆశా కార్యకర్తలు, ఎంపిక చేసి శిక్షణ ఇవ్వబడిన స్వచ్ఛంద సేవకులు చేస్తారని తెలిపారు. కుష్టువ్యాధికి చికిత్స పూర్తిగా ఉచితంగా అందచేస్తారన్నారు. కుష్టు వ్యాధి సర్వేలో ఆశా కార్యకర్తలు, శిక్షణ పొందిన మగ వలంటీర్‌ను ఒక టీంగా వెళ్లి సర్వే చేస్తారని, సర్వేకు ప్రజలు సహకరించాలని తెలిపారు. అనంతరం సర్వేకు సంబంధించి ఫార్మాట్స్, రోజూ పంపాల్సిన రిపోర్ట్స్‌పై ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ, డీఎస్ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, పీఎంవో రవికుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

ఈ ఏడాది నో..

● తరగతులు జరగవని చెప్పిన ఎన్ఎంసీ
● వైసీపీ ప్రభుత్వ నిర్వాకం
● అసంపూర్తిగా మెడికల్ కాలేజ భవన నిర్మాణాలు
● ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సిబ్బంది నియామకం వృథానేనా..?

మదనపల్లె టౌన్, జూలై 6: వైసీపీ ప్రభుత్వ హయాంలో మదనపల్లెకు మెడికల్ కాలేజి మంజూరైనా..ఏడాది పాటు నిధుల కేటాయింపులో జాప్యం, ఇతర కారణాల వలన రెండేళ్లలో పూర్తి కావాల్సిన మెడికల్ కాలేజి నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. దీంతో గత నెలలో ఢిల్లీ నుంచి మదనపల్లెకు వచ్చిన నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) బృందం సభ్యులు మెడికల్ కాలేజి భవనాలు, అనుబంధంగా నిర్వహించనున్న సర్వజన బోధనాస్పత్రి తనిఖీలో ఎన్ఎంసీ ప్రమాణాలకు అనుగుణంగా లేనందున ఈ ఏడాది (2024-25) మెడికల్ కాలేజి తరగతుల నిర్వహణకు అనుమతి నిరాకరించారు.



మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి క్యాజువాలిటీ విభాగం

ఏడాదైనా ఇటుక పడని వైనం

వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో 12 మెడికల్ కాలేజిలను మంజూరు చేస్తూ అప్పటి సీఎం జగన్ 2021 మే 31 తేదీ బటన్ నొక్కి శంకుస్థాపనలు చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు మంజూరైన మెడికల్ కాలేజి భవనాలకు అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోగ్యవరం వద్ద సీఎం బటన్ నొక్కి తాత్కాలిక శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆరోగ్యవరం వద్ద మెడికల్ కాలేజికి కేటాయించిన 95 ఎకరాల స్థలంలో మెడికల్ కాలేజి నిర్మాణానికి రూ.475 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టు టెండర్‌ను 28 జూన్ 2021 తేదీ మెగా ఇంజనీరింగ్ సంస్థ దక్కించుకుంది. మొత్తం రూ.475 కోట్లలో రూ.375 కోట్లు నాబార్డు నిధులు, రూ.100 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంది. పనులు ప్రారంభించిన 30 నెలల్లో అంటే 2023 జూలై నాటికి మెడికల్ కాలేజి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మదనపల్లె మెడికల్ కాలేజి టెండర్ దక్కించుకున్న మెగా సంస్థ అప్పట్లో అగ్రిమెంట్ కుదుర్చుకోలేదు. దీంతో 2021లో మెడికల్ కాలేజి మంజూరైనా ఏడాది కాలం గడచినా కనీసం చదును పనులు కూడా చేయలేదు.

2024లో ప్రారంభిస్తామన్న జగన్ మాట కల్లలే

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో 12 మెడికల్ కాలేజిల నిర్మాణాలను 2024 సంవత్సరంలో పూర్తి చేసి ఆ సంవత్సరంలోనే ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభిస్తామని అప్పటి సీఎం జగన్ చెప్పారు. కానీ నిధుల కేటాయింపులో ఆలస్యం కావడంతో కాలేజి మంజూరై ఏడాది గడచినా పనులు ప్రారంభం కాలేదు. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో ఎట్టకేలకు 2022 సంవత్సరంలో మెడికల్ కాలేజి పనులు ప్రారంభించారు. ఏపీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించినా సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలు ఆలస్యంగా నడిచాయి. ఆరోగ్యవరం వద్ద మెడికల్ కాలేజికి అవసరమయ్యే తరగతి గదులు, ల్యాబ్‌లు, బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాల నిర్మాణాలు ఆలస్యమవుతూనే ఉన్నాయి.

ఎన్ఎంసీ అనుమతుల నిరాకరణ

రాష్ట్రంలో మంజూరైన 12 కొత్త మెడికల్ కాలేజిల్లో విజయనగరం, రాజమహేంద్రవరం, నంద్యాల, ఏలూరు, మచిలీపట్నంలో 90 శాతం నిర్మాణాలు పూర్తి కాగా ఎన్ఎంసీ బృందాలు తనిఖీలు చేసి వచ్చే విద్యాసంవత్సరం నుంచి 150 సీట్ల చొప్పున ఎంబీబీఎస్ తరగతుల నిర్వహణకు అనుమతి ఇచ్చింది. కానీ మిగిలిన ఏడింటిలో మదనపల్లె, పాడేరు, ఆదోని, మార్కాపురం, పులివెందుల, పిడుగురాళ్లలో భవన నిర్మాణాలు పూర్తి కాలేదు. ఈ క్రమంలో గత నెల 22, 23 తేదీల్లో నేషనల్ మెడికల్ కమిషన్ నుంచి పది బృందాలు ఒకే రోజు ఆకస్మికంగా ఐదుచోట్ల తనిఖీలు నిర్వహించాయి. ఇందులో భాగంగా ఎన్ఎంసీ నుంచి వచ్చిన రెండు బృందాలు మదనపల్లె మెడికల్ కాలేజి భవన నిర్మాణాలు, దీనికి అనుసంధానంగా మదనపల్లె పట్టణంలోని ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రిపై నూతనంగా నిర్మించిన రోగుల గదులు, ల్యాబ్‌లు, పడకలు, మెడికల్ కాలేజి నిర్వహణకు అవసరమైన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామకాల వివరాలను ఎన్ఎంసీ బృందం తనిఖీలు చేసి వీడియోలు తీసింది. కాగా ఆరోగ్యవరం వద్ద మెడికల్ కాలేజి భవనాలు అసంపూర్తిగా ఉండటం, సర్వజన బోధనాస్పత్రిలో అవసరానికి తగ్గ సిబ్బంది లేకపోవడాన్ని ఎన్ఎంసీ బృందం పరిగణలోకి తీసుకుంది. ఈ క్రమంలో ఢిల్లీ ఎన్ఎంసీ నుంచి మదనపల్లె మెడికల్ కాలేజిలో ఈ ఏడాది ఎంబీబీఎస్ తరగతుల నిర్వహణకు అనుమతి నిరాకరిస్తూ మెయిల్ పంపింది.

నూతన సిబ్బంది భవితవ్యం ఏమిటి..?

మదనపల్లె మెడికల్ కాలేజి నిర్వహణకు ప్రిన్సిపాల్‌తో పాటు, వైస్ ప్రిన్సిపాళ్లు, బోధన సిబ్బంది అయిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ల్యాబ్‌ల నిర్వహణకు సాంకేతిక నైపుణ్యం ఉన్న అవుట్ సోర్సింగ్ వర్కర్లు, కాంట్రాక్టు వర్కర్లను నియమించారు. ఇందులో భాగంగా 80 మందికి పైగా ప్రొఫెసర్లు, 102 మంది అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు వర్కర్ల నియామకం చేపట్టారు. కానీ ఇప్పుడు చూస్తే ఎన్ఎంసీ నివేదిక ఆధారంగా మెడికల్ కాలేజి నిర్వహణకు అనుమతి రాకపోవడంతో టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్ భవితవ్యం ఏమిటనేది తెలియడం లేదు. మరో ఏడాది పాటు వీరిని ఇక్కడే ఉంచుతారా లేకుంటే పాత స్థానాలకే పంపుతారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.



అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజి భవన నిర్మాణాలు

మెడికల్ కాలేజి నిర్వహణకు అనుమతులు రాలేదు..

మదనపల్లె మెడికల్ కాలేజి నిర్వహణకు ఈ విద్యా సంవత్సరం అనుమతి రాలేదు. ఆరు నెలలుగా మెడికల్ కాలేజి భవన నిర్మాణాలు పూర్తి చేయడానికి ఏపీఎంఎస్ఐడీసీ అధికారులతో కృషి చేశాము. దీంతో పాటు బోధనాసత్రిలో సిబ్బంది నియామకానికి కష్టపడ్డాము. ఎన్ఎంసీ బృందం తనిఖీలు అనంతరం పర్మిషన్ వస్తుందని అనుకున్నాము. కానీ ఎన్ఎంసీ నుంచి ఈ విద్యాసంవత్సరం తరగతుల నిర్వహణకు అనుమతి రాలేదు.

- డాక్టర్ జమున, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కాలేజి, మదనపల్లె

ఉసురు తీసిన.. సరదా..

కడపకు చెందిన వాళ్లంతా స్నేహితులు.. ఉదయం నుంచి తమ పనులతో గడిపి.. రాత్రి అందరూ ఒకచోట కలిశారు. పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటున్న వాళ్లకు.. కారులో సరదాగా అలా బయటకు వెళ్లి సంతోషంగా గడపాలనే కోరిక పుట్టింది. అనుకున్నదే తడువుగా.. తమ స్నేహితుల్లో ఒకడైన డ్రైవర్ కారులో రాయచోటి మార్గంలో బయలుదేరారు. కడప నుంచి ఏవేవో.. కబుర్లు చెప్పుకుంటూ.. నవ్వుకుంటూ.. వచ్చి గువ్వలచెరువులో పాలకోవా తిన్నారు. అందరూ సంతోషంగా గడిపారు. ఇక అక్కడి నుంచి కడపకు వెళ్లకుండా.. రాయచోటిలో ఉన్న ఓ స్నేహితుడిని కలవాలని అనుకున్నారు. అయితే గువ్వలచెరువులో తిన్న పాలకోవా తీపి.. నాలుక మీది నుంచి ఇంకా పూర్తిగా కడుపులో దిగక ముందే.. మృత్యువు వాళ్లను కబళించింది. ఆయిల్ ట్యాంకర్ రూపంలో నలుగురి ప్రాణాలను నిర్దాక్షిణ్యంగా గాలిలో కలిపేసింది. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

● స్నేహితుడి ఇంటికొస్తూ పరలోకాలకు.. ● ట్యాంకర్‌ను ఢీకొన్న కారు.. ● నలుగురు మృతి
● ఒకరికి తీవ్రగాయాలు ● మృతుల కుటుంబాలకు మంత్రి మండిపల్లె ఆర్థిక సాయం

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురు

రామాపురం/రాయచోటి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ హరిజనవాడ కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి వంతెన సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి సుమారు ఒంటిగంట సమయంలో ఎదురుగా వెళుతున్న స్పిరిట్ ట్యాంకర్‌ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు ఆసుపత్రికి తరలిస్తుండగా.. మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అందరిదీ కడప పట్టణం. మృతుల్లో.. కడప పట్టణం నాగరాజుపేటకు చెందిన ఆంజనేయులు నాయక్ (28) ఉన్నారు. ఇతను భాకరాపేట బెటాలియన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. రాజారెడ్డివీధికి చెందిన అఫ్రోజ్‌ఖాన్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాగరాజుపేటకు చెందిన జితేంద్ర కుమార్ (24), అక్కాయపల్లెలోని శాస్త్రీనగర్‌కు చెందిన షేక్ అలీమ్ (35) ఉన్నారు. రవీంద్రనగర్‌కు చెందిన ఖాదర్‌బాష గాయాలతో బయటపడ్డాడు. అలీంకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అఫ్రోజ్‌ఖాన్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఆతడి భార్య గర్భిణీగా ఉన్నారు. ఆంజనేయులునాయక్, జితేంద్రలకు ఇంకా పెళ్లి కాలేదు. గాయపడ్డ ఖాదర్‌బాష కథనం మేరకు..స్నేహితులు అందరూ కడపలో కలిశారు. మద్యం తాగారు. అలా సరదాగా బయటకు వెళ్లి సంతోషంగా గడుపుదామని.. రాయచోటి వైపు బయలుదేరారు. గువ్వలచెరువులో కారు నిలిపి పాలకోవా తిన్నారు. అక్కడి నుంచి కడపకు వెళ్లాలనుకున్నారు.. అయితే వీళ్లలో ఎవరో రాయచోటిలో ఉన్న స్నేహితుడిని కలిసి వద్దామని అన్నారు. దీంతో రాయచోటికి వస్తుండగా.. చిట్లూరు పంచాయతీ హరిజనవాడ సమీపంలో ఉన్న వంతెన వద్ద ఎదురుగా వెళుతున్న స్పిరిట్ ట్యాంకర్‌ను వీళ్ల ప్రయాణిస్తున్న కారు వేగంగా ఢీకొంది. సంఘటనా స్థలంలో ముగ్గురు చనిపోయారు. జితేంద్ర ఆసుపత్రికి తరలిస్తుండగా..మార్గమధ్యలో చనిపోయారు. మృతదేహాలను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అర్ధరాత్రి ప్రమాదం జరిగినా.. ఉదయం 6 గంటల వరకు మృతుల కుటుంబసభ్యులకు తెలియదు. తర్వాత ఎవరో చెప్పడంతో మృతుల భార్య, పిల్లలు, ఇతర కుటుంబసభ్యులు ఆసుపత్రికి వద్దకు వచ్చి గుండెలు పగిలేలా రోదించారు. పనులకు వెళితే కానీ.. కుటుంబాలు గడవవని.. ఇప్పుడు కుటుంబ పెద్ద మరణిస్తే.. జీవించేదెలా.. అంటూ.. రోదించడం అందరినీ కలచివేసింది. ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. సంఘటనా స్థలానికి లక్కిరెడ్డిపల్లె సీఐ గంగానాథ్‌బాబు, రామాపురం ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విజయవాడ నుంచి వచ్చిన రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డిలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద సంఘటన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాయచోటి ప్రభుత్వాసుపత్రిలో మృతులకుటుంబ సభ్యులను పరామర్శించారు. తన తండ్రి మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా మృతులు ఒక్కొక్కరికీ రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తానని మృతుల కుటుంబాలకు హామీ ఇచ్చారు.

మూడునెలల క్రితమే కువైత్ నుంచి వచ్చి..



అఫ్రోజ్‌ఖాన్

కడప నగరం రాజారెడ్డి వీధికి చెందిన పఠాన్ అఫ్రోజ్‌ఖాన్ మూడు నెలల క్రితం కువైత్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. కువైత్‌కు వెళ్లకుండా ఇక్కడే కారు తోలుకుని జీవనం సాగించవచ్చని భావించి ఇటీవల కారు కూడా కొనుగోలు చేశాడు. రాత్రి స్నేహితులతో కలిసి ఆ కారులోనే గువ్వలచెరువుకు వెళ్లి అక్కడి నుంచి రాయచోటికి వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇతడికి భార్య పఠాన్ తబస్సుమ్, ఐదు సంవత్సరాల కుమార్తె, రెండేళ్ల కొడుకుతో పాటు ప్రస్తుతం ఆమె గర్భవతి. ఇంటి పెద్దను కోల్పోవడంతో ఆ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది.

ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ..



జితేంద్ర

కడప నాగరాజుపేటకు చెందిన మరబత్తల జితేంద్ర (25) ప్రైవేటు హాస్పిటల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల తన కాలుకు దెబ్బ తగలడంతో మూడు నెలల నుంచి ఇంటి వద్ద ఉన్నాడు. స్నేహితుడు కారు కొన్నాడని శుక్రవారం ఇంటి నుంచి 8 గంటలకు బయటికి వెళ్లాడు. స్నేహితులతో కలిసి అదే కారులో ప్రయాణం చేస్తూ మృత్యుఒడిలోకి చేరుకున్నాడు. తండ్రి వెంకటరమణ కొరియర్ సర్వీసులో పనిచేస్తున్నాడు. ఇతడికి సోదరుడు కూడా ఉన్నాడు. ఇతడి మృతితో ఆ ఇంట్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

వీడియోగ్రాఫర్‌గా పనిచేస్తూ..



కడప అక్కాయపల్లెలోని శాస్త్రినగర్‌కు చెందిన షేక్ ఆలీం (30) వీడియోగ్రాఫర్‌గా వీడియో ఎడిటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్నేహితుడు కారు కొన్నాడని రాత్రి 9.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇతడి భార్య షేక్ సబియా ఏడు నెలల గర్భిణీ, ఇతడికి రెండు సంవత్సరాల కొడుకు కూడా ఉన్నాడు. ఇంటి పెద్ద మృతితో వారు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



ట్రిపుల్ ఐటీలో గంజాయి పట్టుబడడం సిగ్గుచేటు

● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

వేంపల్లె, జూలై 6: ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో పరిపాలన అస్తవ్యస్తంగా తయారైందని, ఇక్కడ విద్యార్థుల వద్ద గంజాయి పట్టుబడటం సిగ్గుచేటని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. ఐటీ శాఖ మంత్రి నారాలోకేశ్ ఆదేశాల మేరకు శనివారం ఆయన ఇడుపులపాయ ట్రిపుల్ఐటీని సందర్శించారు. డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. విద్యార్థుల వద్ద గంజాయి ఉండడం సంస్థకే సిగ్గుచేటని, ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. సక్రమమైన పరిపాలన అందిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ట్రిపుల్ఐటీలు అస్తవ్యస్తంగా అయ్యాయన్నారు. టీడీపీ ప్రభుత్వం ట్రిపుల్ ఐటీలను గాడిలోపెట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థాన చైర్మన్ జీవీ రమణ పాల్గొన్నారు.

ట్రిపుల్ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త రాజీనామా

ఇడుపులపాయ ట్రిపుల్ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తన పదవికి రాజీనామా చేశారు. హైదరాబాద్ జేఎన్టీయూలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయనను 8 నెలల క్రితం ఇడుపులపాయ డైరెక్టర్‌గా వైసీపీ ప్రభుత్వం నియమించింది. ఎన్నికల అనంతరం టీడీపీ ప్రభుత్వం వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం రాజీనామా చేసినట్లు డైరెక్టర్ తెలిపారు. రిలీవ్ ఆర్డర్ వచ్చిన వెంటనే మాతృసంస్థకు వెళతానని తెలిపారు.

9న జడ్పీ సర్వసభ్య సమావేశం

కడప(రూరల్), జూలై 6: ఉమ్మడి కడప జిల్లా జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని 9వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు సీఈవో ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. జడ్పీటీసీ సభ్యులు, గౌరవ సభ్యులు, కడప, అన్నమయ్య జిల్లాల అధికారులు వారి ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

పులివెందులకు వచ్చిన మాజీ సీఎం

పులివెందుల, జూలై 6: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం పులివెందులకు వచ్చారు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో ఆయన పులివెందులలోని తన ఇంటికి చేరుకున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన మూడు రోజుల పర్యటనలో భాగంగా పులివెందులకు వచ్చారు. పార్టీ కార్యాలయంలో ఎదురుచూస్తున్న నాయకులను, అభిమానులను కలిశారు. పలువురితో సెల్ఫీలు దిగారు. అనంతరం తన ఇంటికి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పులివెందులలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

● ఇసుక అక్రమ రవాణా నివారణకు పటిష్ట చర్యలు ● జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి (కలెక్టరేట్) జూలై 6 : జిల్లాలో వినియోగదారులకు ఇసుక లభ్యతపై ఎలాంటి సమస్యలు లేకుండా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు జాయింట్ కలెక్టర్‌తో పాటు డీఆర్‌వో, సంబంధిత అధికారులు హాజరయ్యారు. శనివారం విజయవాడలోని సీ.ఎస్ క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రంలో ఇసుక విధానం అమలుపై సమీక్షించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఇసుక పరిస్థితులపై ముఖ్యమంత్రి సమీక్షించారని తెలిపారు. సుప్రీంకోర్టు, నేషనల్ ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా ఇసుక తవ్వకాల వల్ల పర్యావరణ ప్రభావం తగ్గించడానికి అవసరమైన అన్ని నిబంధనలు పాటించి సరసమైన ధరకు ఇసుక ఏడాది పొడవునా వినియోగదారులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. త్వరలో సమగ్ర ఇసుక విధానం రూపొందించే వరకు వినియోగదారులకు ఇసుక అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక పాలసీ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న ఇసుక రీచ్‌లు, డిపోలలో ఉన్న ఇసుక లభ్యత, ఇసుక రేటు తదితర అంశాలపై సమగ్ర నివేదికను రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌వో సత్యనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

రవాణా, యువజన, క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, జూలై6: రామాపురం మండలం కొండావాండ్లపల్లె వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలను ఆదుకుంటామని రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన రోడ్డు ప్రమాద సంఘటనను పరిశీలించి జరిగిన ప్రమాదంపై బాధితుల కుటుంబాలను, అధికారులను, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాయచోటి ఏరియా ఆస్పత్రికి చేరుకుని రోడ్డు ప్రమాదంలో నాలుగు మృతదేహాలను సందర్శించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తక్షణ సాయం కింద మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ.25 వేలు చొప్పున లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని మంత్రి అందజేశారు. అనంతరం మీడియాతో మట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయాన్ని అందించేందుకు తన వంతు కృషి చేస్తానని బాధిత కుటుంబాలకు హామీ ఇచ్చారు.

దాడి కేసులో నలుగురు నిందితుల అరెస్టు



నిందితులతో సీఐ చాంద్‌బాష, ఎస్ఐ ప్రవీణ్

వేంపల్లె, జూలై 6: వేంపల్లెలో అజయ్‌కుమార్ రెడ్డిపై జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులను శనివారం అరెస్టు చేశామని సీఐ చాంద్‌బాష తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ విలేకరులకు వివరాలు వెల్లడించారు. శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్ రెడ్డి అనుచరుడు, వైసీపీ కార్యకర్త అజయ్‌కుమార్‌రెడ్డిపై శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పదిమందికి పైగా హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలించగా సింహాద్రిపురం వాసి గండూరు హిదయతుల్లా, కోవరంగుట్టపల్లెకు చెందిన మల్లెల మహేశ్వరరెడ్డి, వేముల మండలం నల్లచెరువుపల్లె వాసులు రామిరెడ్డి ధరణీశ్వర్‌రెడ్డి, కొండాపురం మండలం దొంకుపల్లెకు చెందిన పందిళ్ల శివకుమార్‌రెడ్డిని గుర్తించి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. టీడీపీ మండల పరిశీలకులు రఘునాథరెడ్డి, టీడీపీ నేతలు రవితేజారెడ్డిని గతంలో తిట్టాడని, అసభ్యకరంగా పోస్టులు పెట్టారనే కారణంగా అజయ్‌కుమార్‌రెడ్డిపై దాడి చేసినట్లు నిందితులు అంగీకరించారన్నారు. కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించగా కడప జైలుకు తరలించారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

రేబిస్ టీకాలను తప్పక వేయించాలి

● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శారదమ్మ

కడప(రూరల్) జూలై 2: పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలను తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శారదమ్మ తెలిపారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం కడప నగరంలోని బహూళార్థ పశువైద్యశాల(వీపీసీ)లో పెంపుడు కుక్కలకు పిచ్చి ఎక్కకుండా ఉచితంగా రేబిస్ టీకాలు వేశారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మ మాట్లాడుతూ కుక్కలకు రేబిస్ వచ్చిన తరువాత వైద్యం లేదనందున పెంపుడు కుక్కల యజమానులు ముందుగానే కుక్కలకు టీకాలు వేయించుకుని పెంపుడు జంతువులను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వీపీసీ ఉపసంచాలకులు డాక్టర్ కె. రంగస్వామి, ఏడీడీఎల్ రాజశేఖర్, డాక్టర్ సంధ్య, ఎల్ఎస్‌ఏ షాహిదాబేగం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు ఇవ్వకపోతే చంపుతామని బెదిరించారు

● బాధితుడి ఆవేదన



వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు ఓబులేసు

జమ్మలమడుగు, జూలై 6: డబ్బు వెంటనే చెల్లించకపోతే చంపుతామని బెదిరించినట్లు ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితుడు కాకి ఓబులేసు వివరించారు. ప్రొద్దుటూరు మండలం చౌడూరు వాసి ఓబులేసు కొలిమిగుండ్ల మండలం తిమ్మనాయునిపేటలో వివాహం చేసుకున్నాడు. అత్తగారింటికి వెళ్లి మూడు రోజులు ఉండి అక్కడి నుంచి ఉదయాన్నే జమ్మలమడుగు మీదుగా ప్రొద్దుటూరుకు స్కూటర్‌లో బయల్దేరాడు. బాధితుడు ఎక్స్‌కవేటర్ డ్రైవర్. దేవగుడి గ్రామం బైపాస్ రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తులు దారి కాచి ద్విచక్ర వాహనంలో వెంటపడి కత్తితో దాడి చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఓబులేసుకు తల వద్ద, చేతికి, నడుము వద్ద రక్తగాయమైంది. వెంటనే దేవగుడి గ్రామానికి చెందిన కొందరు బాధితుడిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తాను ప్రొద్దుటూరులోని శ్రీనివాసులరెడ్డి, సుబ్బారెడ్డి ఎక్స్‌కవేటర్ ఓనర్లకు డబ్బు బాకీ ఉన్నట్లు తెలిపారు. తనపై దాడికి వచ్చినవారు గుర్తు తెలియని వారు అని, బాకీ డబ్బు వెంటనే చెల్లించకపోతే ఇది మొదటిసారి అని, రెండో సారి వస్తే ఏకంగా చంపుతామని బెదిరించినట్లు బాధితుడు ఆరోపించారు. సమాచారాన్ని జమ్మలమడుగు అర్బన్ పోలీసులకు, ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. బాధితుడు తనపై దాడికి సంబంధించి అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని తెలిపాడు.

రూ.17 లక్షల ఎరువులు సీజ్

పుల్లంపేట, జూలై 6: మండలంలో వ్యవసాయశాఖ సహాయ వ్యవసాయ సంచాలకులు సాయిరెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు శనివారం ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఎరువుల దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులపై 17 లక్షలు విలువైన 84.29 టన్నుల ఎరువులను సీజ్ చేశారు. ఈ తనిఖీలో విజిలెన్స్ అధికారి రామక్రిష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



చాపాడు, జూలై 6: గుంతచీపాడు వాసులు నీలపాల గంగయ్య, నాగలక్ష్మి కుమారుడు విద్యార్థి నీలపాల గణేష్ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. గణేష్ మైదుకూరులోని మాంటిస్సోరీ పాఠశాలలో టెన్త్ చదువుతున్నాడు. ఈనెల 4వ తేదీ గురువారం రాత్రి ఇంటి పైన గణేష్, అతని తమ్ముడు హర్షవర్ధన్ నిద్రించినట్లు తెలిపారు. తెల్లవారేసరికి గణేష్ కనిపించలేదన్నారు. గణేష్ పుస్తకాలు, బ్యాగు, రెండు జతల దుస్తు లు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇంట్లో నాగలక్ష్మి, ఆమె తండ్రి కూడా నిద్రించినట్లు తెలిపారు. గంగయ్య గల్ఫ్‌దేశాల్లో ఉన్నాడు. నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి టిప్పరు దగ్ధం



బి.కోడూరు, జూలై 6: టమటంవారిపల్లె సమీపాన నేషనల్ హైవేకు గ్రావెల్ తోలుతున్న టిప్పరు విద్యుత్ తీగలు తగిలి దగ్ధం కాగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అందులో ఉన్న డ్రైవరు కిందికి దూకడంతో టిప్పరు మాత్రమే పూర్తిగా కాలిపోయింది. పోరుమామిళ్ల అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. నేషనల్ హైవే పనులు మెగా కంపె నీ వారు చేపడుతున్నారు. గ్రావెల్ తోలేందుకు జయశ్రీ కంపెనీకి ఇచ్చారు. వారు తువ్వపల్లె చెరువు నుంచి గ్రావెల్ తోలుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

సుప్రీంకోర్టు కేసులపై ప్రత్యేక లోక్ అదాలత్

కడప(రూరల్), జూలై 6: సుప్రీంకోర్టులో పెండింగ్ ఉన్న కేసుల పరిష్కారం కోసం శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారం కోసమే ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని కక్షిదారులు, న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. ప్రత్యేక లోక్‌అదాలత్‌కు శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవల చైర్మన్ స్వర్ణ ప్రసాద్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించారు.

హెల్మెట్ ప్రాముఖ్యతపై ర్యాలీ

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో హెల్మెట్ ప్రాముఖ్యతపై శనివారం కడప నగరంలో ర్యాలీ నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ భాష్కర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుళ్లు మహేష్, కిరణ్, ఇతర కానిస్టేబుల్స్, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో హెల్మెట్ ప్రాముఖ్యతపై న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు.

ఇంకొక్కటి అడిగారు... వలకు చిక్కారు !

ఎప్పుడూ ఒకశాతం తీసుకునేవారు.. రెండు కావాలన్నారు ● సీబీఐ వలలో పడిన అవినీతి చేపల కథ

డీఆర్ఎం సహా ఐదురుగు రైల్వే అధికారుల అరెస్టు ● లంచం ఇచ్చినందుకు ఇద్దరు కాంట్రాక్టర్లపైనా కేసు



సీబీఐ వలకు చిక్కిన అవినీతి అధికారులు

గుంతకల్లు, జూలై 6: ఎప్పుడూ ఒక శాతం కమీషన్(లంచం) తీసుకునేవారు..! ఈసారి మరోశాతం అదనంగా కావాలని అడిగారు. ఆ దురాశే వారిని ఊచలు లెక్కబెట్టేలా చేసింది. సీబీఐ వలకు చిక్కి పరువు బజారుకీడ్చింది. గుంతకల్లు రైల్వే డివిజన్ కేంద్రంలో తొలిసారి సీబీఐ దాడులు జరగడానికి ఇదే కారణం అంటున్నారు. డీఆర్ఎం కార్యాలయంలో ఓ శాఖాధికారిపై కాంట్రాక్టర్లు చేసిన ఫిర్యాదు అవినీతి వృక్షాలను పెకిలించింది. రైల్వే అకౌంట్స్ విభాగంలో అవినీతి బురద డీఆర్ఎం కార్యాలయానికి మాసిపోని మరకలను అంటించింది. తిరుపతిలో ఆరు నెలల కిందట జరిగిన సీబీఐ దాడులు మరువకనే అంతకుమించి అవినీతిని బయట పెట్టే దాడులు గుంతకల్లులో జరిగాయి. డీఆర్ఎం వినీత్ సింగ్, బదిలీపై వెళ్లిన సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) యు.అక్కిరెడ్డి, సీనియర్ డీఎఫ్ఎం కె.ప్రదీప్ బాబు, అకౌంట్సు విభాగం సూపరింటెండెంటు బాలాజీ, గతిశక్తి చీఫ్ ప్రాజెక్టు మేనేజరు కార్యాలయ అకౌంట్సు అసిస్టెంటు డి.లక్ష్మీపతిరాజును సీబీఐ అరెస్టు చేసింది. వారిని కర్నూలు సీబీఐ కోర్టులో హాజరు పరచగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. లంచం ఇచ్చినందుకు ఇద్దరు కాంట్రాక్టర్లనూ సీబీఐ మూసేసింది. అంతా కర్నూలు జిల్లా జైలుకు శనివారం రాత్రికి చేరుకున్నారు. సీబీఐ దాడులు రైల్వే డివిజన్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అక్రమార్కుల గుండెలు హడలిపోతున్నాయి. మూడు రోజులుగా డీఆర్ఎం కార్యాలయంలో అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ గడిపారు.

ఇలా మొదలైంది..

గుంతకల్లు రైల్వే డివిజన్‌కు కేంద్రం ప్రభుత్వం నుంచి గతిశక్తి ప్రాజెక్టు కింద భారీగా నిధులు విడుదలయ్యాయి. సేఫ్టీ కేటగిరిలో వచ్చిన ఈ నిధులతో వంతెనలను నిర్మించాల్సి ఉంది. పీలేరుకు చెందిన సత్యనారాయణ ప్రధాన కాంట్రాక్టరుకు రూ.50 కోట్ల విలువైన బ్రిడ్జి వర్కులు దక్కాయి. ఆయన వంతెన పనులను సబ్ కాంట్రాక్టర్లకు ఇచ్చారు. పనులను ప్రాంభించడానికి అనుమతి పత్రం కోసం సబ్ కాంట్రాక్టర్లు రమేశ్ రెడ్డి, రహ్మతుల్లా అకౌంట్సు కార్యాలయం చుట్టూతిరిగారు. సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్ బాబుకు కొంత మొత్తం లంచంగా ఇచ్చారు. అయినా పనిచేయకుండా.. పెద్ద మొత్తంలో డిమాండు చేశారు. దీంతో సబ్ కాంట్రాక్టర్లు సీబీఐ అధికారులను ఆశ్రయించారు. సీబీఐ అధికారులు గుంతకల్లుకు వచ్చి.. నిఘా వేశారు. సీబీఐ డీఎస్పీ జైకుమార్ భారతీయ, ఆయన సిబ్బంది అవినీతి అధికారిని పట్టుకునేందుకు పథకం రచించారు. పథకం ప్రకారం సబ్ కాంట్రాక్టర్లు ఇచ్చిన రూ.11 లక్షల లంచం డబ్బును అకౌంట్సు సిబ్బంది తీసుకున్నారు. సీబీఐ అధికారులు వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్ బాబును పట్టుకున్నారు. ఆ తరువాత వీడియో కాన్ఫరెన్సులో ఉన్న డీఆర్ఎం వినీత్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. డీఆర్ఎం, సీనియర్ డీఎఫ్ఎం ఇళ్లల్లో సోదా చేశారు. భారీగా బంగారు ఆభరణాలు, డబ్బు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) యు.అక్కిరెడ్డికి కూడా ఈ అవినీతిలో భాగం ఉందని నిర్ధారించుకుని, అతడిని సికింద్రాబాదు నుంచి రప్పించి అరెస్టు చేశారు. వారిపై అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం 61(2)-బీఎన్ఎస్, 7, 8, 9, 10, 12 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. గతంలో లంచం ఇచ్చిన ఇద్దరు సబ్ కాంట్రాక్టర్లపై కూడా కేసులు నమోదు చేశారు. వీరందరికీ గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం వైద్య పరీక్షలు చేయించి, కర్నూలు సీబీఐ కోర్టు ఎదుట హాజరు పరిచారు.

వైసీపీ భక్తులు..

నెల కిందటి వరకూ గుంతకల్లు డివిజనల్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) హోదాలో పనిచేసిన అక్కిరెడ్డికి, సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్ బాబుకు వైసీపీ అంటే వల్లమాలిన అభిమానం. ఈ అవ్యాజమైన ప్రేమతో పలువురు కాంట్రాక్టర్లకు దక్కాల్సిన పనులను వైసీపీ అనుకూలురైన కాంట్రాక్టర్లకు వచ్చేలా ఉడతా సాయాలు చేసినట్లు సమాచారం. అధికారులమన్న ధ్యాస లేకుండా ఆ పార్టీకి కొమ్ముకాశారన్న ఆరోపణలున్నాయి. టెండర్లలోనే కాంట్రాక్టర్లు పోటీ పడకుండా అస్మదీయులకు అప్పగించినట్లు బలమైన ఆరోపణలున్నాయి. డివిజన్‌లోని పలువురు కాంట్రాక్టర్లకు వారి వ్యవహారం కంటగింపుగా మారినట్లు సమాచారం. ఆ అసంతృప్తే కాంట్రాక్టర్లలో ఇలా బైటపడిందని డీఆర్ఎం కార్యాలయంలో చర్చించుకుంటున్నారు. గుంతకల్లులోని ధర్మవరం గేటు వద్ద ఆర్‌యూబీ వంతెన నిర్మాణ శంకుస్థాపనకు మార్చిలో హాజరై స్టేజీ ఎక్కి మరీ వైసీపీ భజన చేశారు. వీరిలో ఒకరు ఎన్నికల తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని, ఆ కార్యక్రమానికి హాజరు కావడానికి పాసు కూడా తెప్పించుకున్నట్లు తెలిసింది.

రెండు శాతం డిమాండుతో..

కేంద్ర ప్రభుత్వం రైల్వే పనులకు సంబంధించి ఏ డివిజన్‌కు ఆ డివిజన్‌లో టెండర్లను నిర్వహించనీయకుండా, పలు వర్కులను కలిపి ఒకే పెద్ద వర్కుగా మార్చి అంబ్రెల్లా వర్కుల పేరిట బిడ్లను ఆహ్వానిస్తోంది. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు.. స్థానిక అధికారులకు ఒక శాతానికి మించకుండా మామూళ్లు ఇస్తుంటారు. కానీ కడప వద్ద సబ్ కాంట్రాక్టర్లు చేసేందుకు సిద్ధపడిన వంతెనల వర్కులపై 2 శాతం మమూలు ఇవ్వాలని డిమాండు చేశారని సమాచారం. అందుకే వ్యవహారం తెగేదాకా వచ్చిందని అంటున్నారు. రైల్వే డివిజన్‌లోని తిరుపతిలో ఇద్దరు ఉద్యోగులు ఫిబ్రవరిలో సీబీఐ చేతికి చిక్కారు. ఎలెక్ట్రికల్ ఎస్ఎస్ఈగా పనిచేస్తున్న గంటా రామమోహనరావు, ఏడీఈఈగా పనిచేస్తున్న అప్పలరాజు, మెసర్స్ కోర్ ఫోర్ ఇంజనీరింగ్ కంపెనీ నుంచి రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా సీబీఐ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. తిరుపతిలోని కోచ్ వాషింగ్ అండ్ సిక్ మెయింటెనెన్స్ డిపోలో బోగీలకు 750 ఓల్టు విద్యుత్తు సరఫరా కాంట్రాక్టు విషయమై లంచం తీసుకుంటూ వారు దొరికారు. అది జరిగి ఆరు నెలలు తిరక్కుండానే డివిజనల్ హెడ్ క్వార్టర్లలోనే అవినీతి చేపలు సీబీఐ వలకు చిక్కాయి.

వైవీయూ బీఎడ్, ఎంఎడ్ పరీక్షల తనిఖీ



బీఎడ్, ఎంఎడ్ పరీక్షలను తనిఖీ చేస్తున్న రిజిస్ట్రారు రఘునాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూలై 6: వైవీయూ అనుబంధ కళాశాలలో జరుగుతున్న బీఎడ్, ఎంఎడ్ 2, 4 సెమిస్టరు పరీక్షలను వైవీయూ రిజిస్ట్రార్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి తనిఖీ చేశారు. శనివారం కడప నగరం బీఎడ్ కళాశాల రాయచోటి శివారులో ఉన్న భరత్ బీఎడ్ కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కేంద్ర అబ్జర్వర్లు పరీక్షలను కేంద్రంలో ఉండి పర్యవేక్షించగా యూనివర్శిటీ ఫ్లైవర్ కమిటీ బృందాలు అన్ని కేంద్రాలు తనిఖీ చేశారు. జిల్లాలోని 15 కేంద్రాల్లో 3143 విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఎస్.ఈశ్వర్‌రెడ్డి తెలిపారు.

భూవివాదంపై ఘర్షణ

● పలువురికి గాయాలు

బ్రహ్మంగారిమఠం, జూలై 6: బాగాదిపల్లెలో శనివారం సాయంత్రం పడిగెపాటి పుల్లారెడ్డి, కంచంరెడ్డి నారాయణరెడ్డి కుటుంబీకులు, మరికొందరు భూవివాదంపై ఘర్షణ పడ్డారు. ఇందులో పలువురు గాయాలపాలయ్యాయి. ప్రజల వివరాల మేరకు.. 15 ఏళ్లగా ఒకే కుటుంబానికి చెందిన భూమి మరొకరు సాగు చేసుకుంటుండేవారు. కుటుంబ సభ్యులు కావడంతో అందరికీ సమంగా భూమి కావాలని శనివారం భూమిని దున్నుతున్న పడిగెపాటి పుల్లారెడ్డి, వారి కుటుంబ సభ్యులను కంచెంరెడ్డి నారాయణరెడ్డి అడ్డుకోగా ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఇందులో పలువురికి గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను అంబులెన్స్ సాయంతో ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ప్రజలు తెలిపారు. ఎస్ఐ విద్యాసాగర్‌ను వివరణ అడగ్గా, ఇంత వరకు మాకు సమాచారం లేదని, సమాచారం వస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

అగ్నివీర్ వాయు పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కడప (మారుతీనగర్) జూలై 6: అగ్నివీర్ పథకంలో భాగంగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (అగ్నివీర్ వాయు) ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఎ.సురేష్‌కుమార్ తెలిపారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసేందుకు కనీసం 50 శాతం మార్కులతో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లీషు, సబ్జెక్టులతో ఇంటర్‌మీడియేట్ (10+2) తత్సమాన ఉత్తీర్ణత కలిగి వుండాలన్నారు. ఆన్‌లైన్‌లో agnipathvayu.cdac.in లింక్ ద్వారా ఈనెల 8 నుంచి 28లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కావున జిల్లాలోని ఔత్సాహిక యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వాహనం ఢీ - మహిళకు గాయాలు



లక్కిరెడ్డిపల్లె జూలై6: నిత్యావసర సరుకుల గోదాము వద్ద గుర్తుతెలియని వాహనం మతిస్థిమితంలేని గులాబ్‌జాని ఢీకొంది. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. మతిస్థిమితంలేని మహిళ లక్కిరెడ్డిపల్లెలో ఆకలి తీర్చుకునేందుకు తిరుగుతూ ఉంటుంది గర్తు తెలియని వాహనం ఢీకొనడంతో స్థానికులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించారు. వాహనాన్ని సీసీ కెమెరాలు ద్వారా గమినించి పట్టుకుంటామని పోలీసులు తెలిపారు

తెగి పడిన విద్యుత్ లైన్లను సరిచేయాలి

జిల్లా విద్యుత్ శాఖ అధికారి రమణ



ఫక్కీరుపల్లె సబ్‌స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్ల లైన్లను చెక్ చేస్తున్న రమణ

కడప (నాగరాజుపేట), జూలై 6: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తెగిపడిన విద్యుత్ తీగలను సకాలంలో సిబ్బంది స్పందించి సరిచేయాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ తెలిపారు. కడపలోని 33/11 కేవీ పక్కీరుపల్లె సబ్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం కడపలో సిబ్బంది, అధికారులతో సమావేశమైన ఆయన విద్యుత్ పనుల్లో భద్రతా నియమాలు విధిగా పాటించాలని ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల లైన్లలో జరిగే సమస్యలను గుర్తించి ముందస్తు మరమ్మత్తులు చేసి అంతరాయాలను అరికట్టాలన్నారు. లో ఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా అవసరమైననన్ని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధప్రాతికదిన తగు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచడంలో భాగంగా విద్యుత్ స్తంభాలను తాకకుండా, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకకుండా మరమ్మత్తులు చేయించుకోవాలన్నారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కడప డీఈఈ నాయక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు హరిక్రిష్ణ, రామక్రిష్ణ, షకీల్ అహ్మద్, జూనియర్ ఇంజనీర్లు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోటా పోటీగా కబ్జా యత్నాలు



మోడల్ స్కూల్ ఎదుట భూమిని చదును చేస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, జూలై6: అనేక పోరాటాల ఫలితంగా కార్మికుల కోసం కేటాయించిన ఇళ్ల స్థలాల్లో మిగులు స్థలాన్ని పలువురు కబ్జా చేసేందుకు పోటీ పడుతున్నారు. ఇందులో రెండువర్గాల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. తాజాగా శుక్రవారం ఓ వర్గం ఎక్స్‌కవేటర్‌తో చదును చేయగా, శనివారం మరో వర్గం పునాదులు వేసింది. వివరాల్లోకెళితే...

బి.కొత్తకోటలో ప్రభుత్వభూమి కబ్జాలు, నకిలీపట్టాలు, అధికారులపై అజమాయిషీ నిత్యకృత్యంగా మారింది. నిలువ నీడలేని పేదలు జానెడు ఇంటిజాగా కోసం వెంపర్లాడితే అర్థం వుంది కానీ, రాజకీయ, సామాజికం, ఆర్థికంగా అన్ని రకాలుగా స్తోమత వుండి కూడా తామేదో పేదోళ్ల అన్నట్లు కలరింగ్ ఇచ్చి ప్రభుత్వ భూమి కాజేసేయత్నం చేయడం పట్టణ ప్రజలకు విస్మయం కలిగిస్తోంది. నగరపంచాయతీ పరిధిలో స్థలం సునాయాసంగా కొట్టేయాలన్నా, కబ్జా చేయాలన్నా, అందరికీ గుర్తు వచ్చేది పెయింటర్స్ కాలనీ. ఎప్పుడో బి.కొత్తకోట మండలం మదనపల్లె నియోజకవర్గంలో భాగంగా వున్నప్పుడు సీపీఐ నేతల పోరాట ఫలితంగా పట్టణశివారు బీరంగి పంచాయతీ సర్వేనంబరు 58-2లో ఏర్పడిన ఈ పెయింటర్స్ కాలనీలో కార్మికుల కోసం ఇళ్లస్థలాలను కేటాయించారు. పోగా మిగిలిన స్థలం రిజర్వులో వుంచారు. కమ్యూనిటీ పర్పస్ కింద మరికొంత స్థలాన్ని కేటాయించారు. కాలక్రమేణా రిజర్వు స్థలం కబ్జాకు గురవుతూ వచ్చింది. కమ్యూనిటీ స్థలం మాత్రం మిగిలింది. ఎన్నికలకు మునుపు ఇక్కడి తహసీల్దార్ బలహీనతలను ఆసరాగా చేసుకుని ఈ భూమిపై కొందరు కన్నేశారు. నయానో భయానో తాము ఆ ప్రదేశంలో వుంటున్నట్లు పొసెషన్ సర్టిఫికెట్లు తీసేసుకున్నారు. ఈ స్థలం అత్యంత విలువైనది కావడంతో మరికొందరు సైతం తమ ప్రయత్నాలతో మాన్యువల్‌గా పట్టాలు పొందారు. ఆ అధికారి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆ రెండువర్గాల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. కమ్యూనిటీ స్థలం మాదంటే... మాదంటూ ఆధిపత్య పోరుకు దిగారు. ఒకే ప్లాటుకు రెండేసి పట్టాలు వుడడంతో ఓ వర్గం చదును చేయిస్తే, మరో వర్గం పునాదులు తవ్వుతోంది. ఒకరు అధికారాన్ని అడ్డుపెడుతుంటే... మరొకరు ఏకంగా హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. సమస్య పోలీసు, రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లిడంతో మండలంలో చర్చనీయాంశమైంది. కోర్టు ఆదేశాలతో అధికారులు జోక్యం చేసుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు. మరోవైపు ఈ స్థలాన్ని కొట్టేయాలని చూస్తున్న వారిలో ఒక్కరూ అర్హులు కాదని, రాజకీయ, సామాజిక పలుకుబడితో కబ్జాకు యత్నిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

జూనోసిస్ వ్యాధులపై అవగాహన అవసరం

● విద్యార్థులతో డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

రాయచోటిటౌన్, జూలై6: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన అవసరమని జాతీయ ఆరోగ్య మిషన్ అన్నమయ్య జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. శనివారం ప్రపంచ జూనోసిస్ దినం సందర్భంగా స్థానిక మాసాపేటలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో పారామెడికల్ బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 6న ప్రపంచ జూనోసిస్‌డేగా నిర్వహించుకుంటున్నామన్నారు. జంతువుల నుంచి మానవులకు సంక్రమించే రేబిస్, స్వైన్ ఫ్లూ, బర్డ్‌ఫ్లూ, మెనింజైటిస్, ఇన్‌ఫ్లుయెంజా, బ్యాక్టీరియా ద్వారా వ్యాపించే ఆంత్రాక్స్, బోవైన్ టీబీ, సల్మోనెల్లాసిస్, సెల్లోసిస్, లెప్టోస్పిరోసిస్, పారాసైటిక్ వ్యాధులు, టినియాసిస, స్కేబిస్, ఆస్కారిస్, హైడ్రాటిడోసిస్, అమీబియాసిస్, సర్కోసిస్టసీస్ మొదలైన సుమారు 280 రకాల వ్యాధులను ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందన్నారు. వాటి నివారణ చర్యల్లో భాగంగా మనం పెంపుడు జంతువులకు సకాలంలో పశువుల ఆసుపత్రిలో టీకాలు వేయించాలని, నట్టల నివారణకు మందులు వేయించాలని, పశువుల కొటాల దగ్గర పరిశుభ్రత పాటించాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని, పశుపోషకులు, రైతులు, కుక్కలను ఇంటిలో పెంచుకునే వారు, జంతు ప్రదర్శనశాలలో పనిచేయు వారు, కసాయి పనిచేయువారు, కోళ్ల పరిశ్రమలో పనిచేయు వారు ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం ప్రపంచ జూనోసిస్ డేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, ఈపీడీమోలో జిస్ట్ వెంకటేశ్, ఎంపీహెచ్‌ఈవో శివారెడ్డి, పర్యవేక్షకులు పెంచలయ్య, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, టీచర్స్ పాల్గొన్నారు.



సాంక్రమిక వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

సుండుపల్లి: సుండుపల్లె పశు సంవర్ధక శాఖ పశువైద్యశాలలో శనివారం ఉచిత రేబిస్ వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహించినట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ కొమ్మినేని విజయ్‌కుమార్ తెలిపారు. 35 కుక్కలకు టీకాలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ విజయ్‌కుమార్, రమణయ్య పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేట పశువైద్యశాలలో పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు విజయభాస్కర్‌రావు ఆధ్వర్యంలో 69 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకు కె.ప్రతాప్, పశువైద్యాధికారి కె.భాగ్యవతి, సిబ్బంది ఎం.వరదయ్య, హరిబాబు, బాషా, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : యజమానులు తమ కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని పశువైద్యురాలు డాక్టర్ దుర్గానాగమ్మ తెలిపారు. పెంపుడు జంతువుల పట్ల వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సిద్దవటం: స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలను వేస్తున్నామని, మనుషులు కుక్కకాటుకు గురై ప్రమాదాలకు గురికాకుండా నివారించేందుకు టీకా వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాచుపల్లె పశువైద్యాధికారి డాక్టర్ శ్వేత, వెటర్నరి సిబ్బంది పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులు



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోతుగుంట రమేష్‌నాయుడు

రాజంపేట టౌన్, జూలై 6: జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం రాజంపేట బీజేపీ నేతలు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, పట్టణ కార్యదర్శి రమణ, నాగరాజు, వేణుప్రసాద్‌రాజు, పాపయ్య, రమణ, సుబ్బారావు, నగేష్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్య ఖర్చులకు రూ. 76 వేలు ఆర్థిక సాయం

చిట్వేలి, జూలై 6: మండల పరిధిలోని తుమ్మకొండ వడ్డెపల్లెకు చెందిన ఆవులకుంట మనోహర్ కుమార్తె తేజస్వి ఏలూరు సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద కుటుంబం కావడంతో కుటుంబ సభ్యులు, సామాజిక మాధ్యమాల ద్వారా తమ బాధను వెలిబుచ్చారు. దాతలు మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు, చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ ఫోన్‌పే ద్వారా చిట్వేలి మండల ప్రజలు లక్ష వరకు సాయం అందించారు. విషయం తెలుసుకున్న కోడూరు వడియ రాజుల సంఘం సభ్యులు, పెద్దలు శనివారం ఏలూరు సీఎంసీ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులకు రూ. 76 వేలు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు.

వితంతువులకు ఆర్థిక సాయం

పెనగలూరు, జూలై 6: సామాజిక పెన్షన్ అందని గాంధీనగర్ ఎస్టీ కాలనీలోని వితంతువులకు మండలానికి చెందిన టీడీపీ నాయకులు శనివారం రూ. వెయ్యి చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం పించను మంజూరు చేసేంతవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని నాయకులు తెలిపారు.మండల వ్యాప్తంగా యానాది కాలనీల్లో ఉన్న 15 మంది వితంతువులను గుర్తించి వారికి నెలనెలా వెయ్యి రూపాయల వంతున పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రాం సేవలు చిరస్మరణీయం



బాబూ జగ్జీవన్‌రాంకు నివాళులర్పిస్తున్న నేతలు

నందలూరు, జూలై 6 : భారతదేశ తొలి ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమర యోధుడు బాబుజగ్జీవన్‌రాం సేవలు మరువలేనివని మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. శని వారం నాగిరెడ్డిపల్లె రోడ్డు, భవనాల అతిథిగృహం సమీపంలో బాబూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీమా మునుస్వామి, షేక్‌మౌలా, తుమ్మది శివశంకర్, హెచ్‌డీ ప్రసాద్, శంకర్, సుబ్బరాయుడు, గంగయ్య, ఫిట్టర్ సుబ్బరాయుడు, రామాంజి, నాగరాజు, నరసింహులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

● రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం, జూలై 6: వాహనదారులు అతివేగంగా ప్రయాణించి ప్రాణాలకు హాని తెచ్చుకోరాదని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన రామాపురం మండలం చిట్లూరు హరిజనవాడ సమీపం లోని బ్రిడ్జి వద్ద కారు, ట్యాంకర్ ఢీకొన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప- చిత్తూరు 40వ జాతీయ రహదారిలో వాహనదారులు అతివేగంగా ప్రయాణించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయన్నారు. వాహనదారులు అతి వేగంగా ప్రయాణించి తమ ప్రాణాలకు హాని తెచ్చుకోరాదన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాణం ఎంతో విలువైనదని, రోడ్డు ప్రమాదాల మూలంగా ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా ఇక నుంచి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. బ్లాక్ స్పాట్లలో స్పీడ్ బ్రేకర్లు, కల్వర్టులు, రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలను నడపడం చాలా ప్రమాదకరమని అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. 40వ జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో త్వరలో సొరంగం తవ్వి నాలుగు వరుసల రహదారి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరలో పనులు ప్రారంభించి ఈ ప్రాంత వాసుల చిరకాల కలను నెరవేరుస్తామన్నారు. సొరంగ మార్గం ఏర్పాటుతో చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. రాబోయే రోజుల్లో వాహనదారుల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. మండల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



రాష్ట్ర రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఏఎన్ఎంలు

సమస్యలు పరిష్కరించాలని ఏఎన్ఎంల వినతి

రాయచోటిటౌన్: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఏఎన్ఎంల అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం వంద నుంచి 150 కిలోమీటర్ల దూరంలో సచివాలయాలకు పంపారన్నారు. రీడిప్లాయ్‌మెంట్‌లో ఉన్న తమను వెంటనే గతంలో తాము పనిచేస్తున్న హెల్త్ సబ్ సెంటర్లకు పంపించాలని కోరారు. కాంట్రాక్ట్ పద్దతిలో పనిచేసే కొంత మందిని సుదూర ప్రాంతాలకు పంపించారని, వారిని తిరిగి యథా స్థానంలోకి తీసుకురావాలని విన్నవించారు. గత ప్రభుత్వంలో ఏఎన్ఎంలుగా ఉన్న వారికి జీఎన్ఎం శిక్షణ ఇప్పించి రెండేళ్ల నాలుగు నెలలు గడుస్తున్నా వారినిఉంచడం వల్ల ఇబ్బందులు తప్పడం లేదని ఆయనకు వివరించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మంత్రి కోసం మండల సమావేశం వాయిదా..!

సంబేపల్లె, జూలై 6: సార్వత్రిక ఎన్నికలు జరిగిన తరువాత నియోజకవర్గంలోని సంబేపల్లె మండలంలో జరిగే మొదటి మండల సర్వసభ్య సమావేశానికి రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో సభను వాయిదా వేయాలంటూ మండల టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, యువగళం సిద్దారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి ఎంపీటీసీ సభ్యుడు రామరాజు, శివప్రసాద్‌రెడ్డి, భయ్యారెడ్డి, బాబురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కడియాలపల్లి నాగేశ్వర్ నాయుడు, మధుసూదన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ శివప్రసాద్, మట్లి శ్రీనివాసులునాయుడు, మట్లి వేణు శనివారం ఎంపీడీవో నిర్మలాదేవిని కోరారు. శనివారం మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సమాచారం అందించడంతో సభ్యులందరూ హాజరయ్యారు. అయితే మంత్రి రాకపోవడంతో సభను వాయిదా వేయాలని టీడీపీ నాయకులు కోరారు. దీంతో మండల అధ్యక్షురాలు ఆవుల నాగశ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులతో మాట్లాడి సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలి పారు. ఆదివారం ఉదయం 9 గంటలకు మండల పరిషత్ సభా భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు. సభ్యులతోపాటు, మండల అధికారులు హాజరుకావాలని తెలియజేశారు. అన్ని శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఒంటిమిట్ట, జూలై 6 : విద్యార్థులు వర్షాకాలంలో వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని మండల అభివృద్ధి అధికారి రామచంద్రయ్య తెలిపారు. మండలంలోని పెన్నపేరూరు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు డయేరియా లాంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పాఠశాల, ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రతను పాటించాలని, తాగేనీరు స్వచ్ఛంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శీలాకుమారి, ఉపాధ్యాయుడు మహేష్‌బాబు, మహబూబ్ ఖాన్, పెద్దరెడ్డయ్య, మంజుల, సృజన, అనురాధా, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్నానదిలో ఇసుక రీచ్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

సిద్దవటం, జూలై 6 : మండలంలో ఇసుక రీచ్ ఏర్పాటుకు సంబంధించి జ్యోతి గ్రామ పంచాయతీలోని శివాలయం సమీపంలోని స్థలాలను కడప భూగర్భ గనుల శాఖ ఇన్‌స్పెక్టర్ విమల, మండల తహసీల్దారు మురాద్వావలి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం 2 చోట్ల రీచ్‌లను ఏర్పాటు చేసేందుకు పంచనామా చేశామ న్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు అనూరాధ పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తీర్చాలని రోడ్డెక్కిన మహిళలు

రాజంపేట టౌన్, జూలై 6 : మండల పరిధిలోని శేషమాంబపురం అగ్రహారంలో నీటి సమస్య తలెత్తడంతో ఆ గ్రామానికి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో శనివారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత పులి చిన్నయ్య చెయ్యేరు పరివాహక ప్రాంతంలో భూమిని ఆక్రమించి గడ్డి పెంపకం, కట్టెల బొగ్గు కాల్చేందుకు పంచాయతీ నీరు వాడుతుండడంతో గ్రామంలోకి చుక్కనీరు కూడా రాక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ఈ విషయమై గతంలో పంచాయతీ కార్యదర్శి జగదీష్‌కు అనేకసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. గ్రామం కోసం వేసిన పంచాయతీ బోరునుంచి వస్తున్న నీటిని పూర్తిగా తన పొలానికి మళ్లించుకుని లబ్ది పొందుతున్నాడని వాపోయారు. ఈ విషయంపై చిన్నయ్యను ప్రశ్నించగా ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటున్నాడని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

హౌసింగ్ కార్యాలయంలో రికార్డుల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఈఈ మురళీకృష్ణ

పెనగలూరు, జూలై 6 : పెనగలూరు మండలంలో ఇప్పటివరకు గృహ నిర్మాణ శాఖలో జరిగిన అభివృద్ధి పనులను శనివారం రైల్వే కోడూరు ఇన్‌చార్జి డీఈఈ ఎం మురళీకృష్ణ తనిఖీ చేశారు. గృహ నిర్మాణ శాఖ కార్యాలయానికి చేరుకున్న ఆయన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గిడ్డంగికి వెళ్లి సిమెంటు, స్టీలు నిల్వల ను తనిఖీ చేశారు. అనంతరం వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. లబ్ధిదారులకు మెటీరియల్ ఎంత ఇచ్చింది, బిల్లులు ఎంత మంజూరు చేసింది, ఉపాధహామీ పథకం బిల్లులు పంపిణీ జరిగాయా లేదా అన్న అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఏఈ హరిప్రసాద్, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్, ఆపరేటర్ ఉమాదేవి ఉన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన అవసరం

● స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈబీ సూపరింటెండెంట్ శ్రీనివాసులు

రాయచోటిటౌన్, జూలై 6: మాదక ద్రవ్యాల వినియోగంతో నష్టాలు, అక్రమ రవాణాతో ఇబ్బందులపై విద్యార్థులకు అవగాహన అవసరమని స్పెషల్ ఎన్ ఫోర్స్‌మెంట్ బ్యూరో అన్నమయ్య జిల్లా సూపరింటెడెంట్ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాతో జీవితాలు నష్టపోతాయన్నారు. విద్యార్థులు ఇతరులు మాటలను నమ్మి మోసపోవద్దని, మాదక ద్రవ్యాలను వినియోగించి జీవితాలను బుగ్గిపాలు చేసుకో వద్దని, బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ హిమబిందు, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, సూపర్‌వైజర్ వెంకట నారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ప్రొగ్రాం ఆఫీసర్ సుధాకర్, ఈసీఈ విభాగాధిపతి చెన్నకేశవ, ప్రసాద్ తదితర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడుగా మేర రమణయ్య

రామాపురం, జూలై 6: రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడుగా రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తనకు నియామక పత్రాన్ని అందించినట్లు మేర రమణయ్యయాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంత్రితోపాటు, నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు, జూలై 6: పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శనివారం కర్నూలు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్. సాలురెడ్డి తనిఖీ చేశారు. పలు ఎరువులకు కాలపరిమితి తీరిపోవడంతో విక్రయాలు నిలిపివేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు కొన్న ప్రతి రైతుకు బిల్లు ఇవ్వాలన్నారు. అనుమతి పొందిన ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలని దుకాణ యజమానులకు వివరించామని తెలిపారు. ఈ తనిఖీల్లో తిరుపతి ఎస్ఐ ఎం. రామకృష్ణనాయక్, కోడూరు మండల వ్యవసాయ అధికారి జి. సుధాకర్, వ్యవసాయ అధికారి సీ. రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల సమస్యలు పరిష్కరించాలి : సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న మణి

రైల్వేకోడూరు, జూలై 6: పేదల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక మండ ల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న దళిత, గిరిజనులు ఇంటి స్థలాలు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలా మందికి రేషన్ కార్డులు లేవని, వీధి లైట్లు లేక రాత్రి వేళల్లో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారన్నారు. పేదల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటాలు ఆగవని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షురాలు షేక్ షహింశా, బీకేఎంయూ జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ హజమాబీ, నియోజకవర్గ అధ్యక్షుడు రేవూరి శంకరయ్య, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు సన్నీ, రంగమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏఐఎస్ఎఫ్ రాజకీయ శిక్షణ తరగతులు

రైల్వేకోడూరు, జూలై 6: ఈ నెల 8, 9, 10 తేదీల్లో కాకినాడలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సి. బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం రైల్వేకోడూరు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్, యూజీసీ, నెట్ పేపర్ల లీకేజీని అరికట్టాలన్నారు. ఎన్‌టీఏను రద్దు చేయాలన్నారు. విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా శాస్త్రీయ విద్యా విధానం కోసం అనుక్షణం పోరాటాలు చేస్తుంటామన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరగబోవు శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, వాసు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కోడూరు అభివృద్ధికి కృషి చేయాలి



మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సత్కరించిన కోడూరు నాయకులు

రైల్వేకోడూరు, జూలై 6: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను విజయవాడలో శనివారం రాష్ట్ర జనసేన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ జోన్ కార్యదర్శులు పగడాల వెంకటేష్, జోగినేని మణి, మైసూరివారిపల్లె ఎంపీటీసీ సభ్యులు వరికూటి నాగరాజు, కోడూరు జనసేన నాయకులు పగడాల చంద్రశేఖర్ తదితరులు కలిశారు. రైల్వేకోడూరులో జనసేన పార్టీ అభ్యర్థిని గెలిపించడంలో కూటమి నాయకులు అందరూ పని చేశారని మంత్రికి వివరించామని వారు తెలిపారు. కోడూరు అభివృద్ధిపై ప్రజలకు అనేక హామీలు ఇచ్చామని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. అన్ని రంగాల్లో కోడూరును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం మంత్రి ని నాయకులు ఘనంగా సత్కరించారు.

వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడుగా శివకుమార్



శివకుమార్, మొగిలి వినయ్

రైల్వేకోడూరు, జూలై 6: మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడుగా శివకుమార్, ఉపాధ్యక్షురాలుగా రంగమ్మ, నరసింహులు, గౌరవాధ్యక్షుడుగా షేక్ షాహెన్షా, కార్యదర్శిగా మొగిలి వినయ్, సహాయ కార్యదర్శులుగా తేజ్‌కుమార్, షేక్ సోనీ, వెంకటసుబ్బమ్మను ఏకగ్రీవంగా శనివారం ఎన్నుకున్నారు. వీరితో పాటు 30 మంది మహిళలను సభ్యులు గా ఎన్నుకున్నారు.

కాపుల సంక్షేమానికి కృషి చేయాలి



రామచంద్రయ్యను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సుండుపల్లె, జూలై 6: ఎమ్మెల్సీ సీ. రామచంద్రయ్యను కడపలోని ఆయన స్వగృహంలో కలిసినట్లు టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ గ్రామ అధ్యక్షుడు చెన్నంశెట్టి వెంకటరమణ శనివారం తెలిపారు. ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నిక కా వడంతో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి దుశ్శాలువాతో సన్మానించిన ట్లు తెలియజేశారు. కాపుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరినట్లు తెలిపారు. ఐదేళ్లుగా కాపుల అభివృద్ధిని తుంగలో తొక్కేశారని, రాజకీయంగా ఆర్థికంగా మద్దతు ఇవ్వాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గణేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట నుంచి సిరివరానికి బస్సు నడపాలి



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న వివిధ గ్రామాల ప్రజలు

రాజంపేట, జూలై 6 : రాజంపేట డిపో నుంచి దామనచర్ల మీదుగా సిరివరం గ్రామాని కి బస్సు సర్వీసు నడపాలంటూ రాజంపేట డిపో మేనేజర్ రమణయ్యకు శనివారం వినతిపత్రం సమర్పించారు. రాజంపేట, చక్రంపేట, గట్టువారిపల్లె, హరిజనవాడ, దామనచర్ల, వీఎం పురం, వెంగమాంబపురం మీదుగా సిరివరానికి బస్సు నడిపితే ఆయా గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలియజేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని డీఎం వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంతీయులు నరసింహులు, శివయ్య, గంగాధర్, విజయ్‌కుమార్, వెంకటేశ్, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రుల సమావేశం అభినందనీయం

రాజంపేట, జూలై 6 : తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం కావడం ఆనందదాయకమని ఈ పరిణామం రెండు రాష్ట్రాలకు ఉపయోగమని రాష్ట్ర బీజేపీ కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విభజన సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఆస్తుల పంపిణీ, విద్యుత్ సమస్యలు, నీటి సమస్యలు, ఇరు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌కు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలి

లక్కిరెడ్డిపల్లె జూలై 6: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌కు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి శనివారం మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ మోడల్ స్కూల్‌కు గాలివీడు, పందిళ్లపల్లె, కోనంపేట, పాళెంగొల్లపల్లె, దప్పేపల్లె గ్రామాలనుంచి సుమారు 700 మంది విద్యార్థులు వస్తున్నారన్నారు. రవాణా సదుపాయం లేకపోవడంతో ఆటోల్లో పాఠశాలకు చేరుకుంటున్నారని తెలిపారు. గతంలో మోడల్ స్కూల్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసు నడిచేదని ఏడాది క్రితం ఆ సర్వీసును నిలిపివేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగయ్య, ఉపాధ్యాయుడు సుధాకర్, నిత్యపూజయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం

రాయచోటిటౌన్, జూలై6: పట్టణంలోని రెడ్డీస్ కాలనీ రామాలయంలో శనివారం పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు రాంప్రసాద్‌శర్మ, ప్రభాకర్‌శర్మ స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి కల్యాణ దాతలు మార్గాని శ్రీనివాసులు, సిద్దయ్య దంపతులు సహకారంతో సీతారాముల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులకు కుప్పం సుధారాణి, కుప్పం రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ప్రతినెల కల్యాణం అనంతరం ముగ్గురు వృద్ధ దంపతులకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు రెడ్డీస్‌కాలనీలోని చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.



శునకానికి టీకా వేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్



జూనోసిస్ డే సందర్భంగా శనివారం చిత్తూరు పశుసంవర్ధక శాఖ-బహువిధ పశువైద్యశాలకు వచ్చిన వివిధ రకాల శునకాలు అబ్బురపరిచాయి. ఇందులో డాబర్ మెన్, టెక్కెల్ డాక్సీ ల్యాబ్, టెక్కెల్ వీనర్ డాగ్, బసోన్జీ, సాస్ట్ డాగన్, జర్మన్ షఫర్డ్, పెట్ డాగ్స్ ఉన్నాయి. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ హాజరై యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

- చిత్తూరు (సెంట్రల్)

వ్యాక్సినేషన్‌తో జూనోటిక్ వ్యాధులు దూరం



టీకాల శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు (సెంట్రల్), జూలై 6: జంతువుల నుంచి సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాక్సినేషన్‌తో వాటిని దూరం చేయవచ్చునని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. జూనోసిస్ డేను పురస్కరించుకుని శనివారం చిత్తూరు పశుసంవర్ధక శాఖ-బహువిధ పశువైద్యశాల కార్యాలయంలో పెంపుడు శునకాలకు ఉచిత యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా శునకాలకు 18,500 టీకాలు ఉచితంగా వేసినట్లు చెప్పారు. జేసీ శ్రీనివాసులు, మేయర్ అముద, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్, వెటర్నరీ డాక్టర్లు పాల్గొన్నారు.

న్యాయాధికారులు అవగాహనతో తీర్పులివ్వాలి

● డీజే భీమారావు



న్యాయమూర్తులతో డీజే భీమారావు

చిత్తూరు లీగల్, జూలై 6: భారతీయ న్యాయశాఖ చట్టాలపై న్యాయమూర్తులు పూర్తి అవగాహనతో తీర్పులివ్వాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు కోరారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం న్యాయశాఖ చట్టాలపై ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిక్రీల అమలు, మనీ డిక్రీ అమలు, వాటి విధివిధానాలు - చట్టం, కేసు నిబంధనల గురించి న్యాయాధికారులు తెలుసుకున్నారు. రీసోర్స్‌పర్సన్లను జిల్లా న్యాయమూర్తి శాలువలతో సన్మానించి, మెమెంటోలతో సత్కరించారు. న్యాయమూర్తులు రమేష్, శాంతి, సునీతారాణి, గురునాథ్, వెన్నెల, రాజగోపాల్, రామచంద్రుడు, అర్చన, శ్రీనివాసులు, విష్ణువర్మ, శ్రీనివాస నాయక్, బేబి రాణి, సత్యకాంత్ కుమార్, కృష్ణప్రియ, విశ్రాంత న్యాయమూర్తులు రాంబాబు, జగన్నాథం, పార్థసారధితో పాటు ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు, విత్తనాల విక్రయ కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు



వ్యవసాయాధికారిణి వనితను వివరాలు అడుగుతున్న అధికారి శివన్నారాయణ

వెదురుకుప్పం, జూలై 6: మండలంలో శనివారం పురుగు మందు, విత్తన విక్రయ కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు నిర్వహించారు. పచ్చికాపల్లంలోని మన గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనుమతి లేని ఎరువులను విక్రయించరాదని ఆదేశించారు. అనుమతి లేని గ్రోఫైడ్ ఎరువు 32 కేజీలను గుర్తించారు. ఆత్మ డీపీడీ జి.శివన్నారాయణ, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్, వెదురుకుప్పం వ్యవసాయాధికారిణి వనిత పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఆర్పీ కుచ్చుటోపి

13 గ్రూపులకు చెందిన రూ.14.18 లక్షల స్వాహా ● మెప్మా అధికారుల మొద్దునిద్ర ● పోలీసులకు ఫిర్యాదుతో వెలుగులోకి

పుత్తూరు అర్బన్, జూలై 6:కంచే చేను మేసింది. రూపాయి...రూపాయి కూడబెట్టుకున్న మహిళల నగదును ఆర్పీ గద్దలా తన్నుకుపోయింది. డ్వాక్రా సంఘాలకు, మెప్మాకు మధ్య అనుసంధానకర్తగా ఉండాల్సిన ఆర్పీ (రిసోర్స్ పర్సన్) మహిళల కష్టార్జితాన్ని స్వాహా చేసింది. ఏకంగా రూ.14.18 లక్షల డ్వాక్రా సంఘాల నగదును సొంత అవసరాలకు వాడుకున్నా పసిగట్టలేని స్థితిలో పుత్తూరు మెప్మా అధికారులు ఉన్నారు. జరగాల్సిన నష్టం జరిగిపోయాక తీరిగ్గా ఆడిట్ పేరుతో ఏళ్లతరబడి కాలయాపన చేశారు. దీంతో బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పును చెల్లించాలని నోటీసులు అందుకున్న మహిళలు లబోదిబోమంటూ శనివారం పోలీసులను ఆశ్రయించారు.

కష్టార్జితం స్వాహా : బాధిత మహిళల కథనం మేరకు.... మున్సిపల్ పరిధిలోని ఆరేటమ్మ కాలనీ, ఎన్టీఆర్ కాలనీకి చెందిన డ్వాక్రా సంఘాలకు ఆర్పీగా భాగ్యలక్ష్మి పనిచేస్తున్నారు. 2016-2018 సంవత్సరాల మధ్య డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలకు సంబంధించి చెల్లింపులను తానే స్వయంగా బ్యాంకు వెళ్లి జమచేస్తానని నమ్మబలికి నగదు వసూలు చేశారు. అయితే బ్యాంకులకు చెల్లించకుండా ఆర్పీ భాగ్యలక్ష్మి ఆ నగదును తన సొంత అవసరాలకు వాడుకున్నారు. దీంతో పాటు మిగిలిన కంతులన్నీ ఒకేసారి జమచేస్తే కొత్తగా రుణాలు మంజూరు చేయిస్తానని చెప్పి రూ.లక్షల్లో వసూలు చేశారు. ఆఖరికి మహిళలు నెలానెలా జమ చేసే పొదుపు నగదును కూడా సంఘాల నుంచి అప్పుగా తీసుకుంది. 2020లో ఆరేటమ్మ కాలనీకి చెందిన నెహ్రూ సంఘానికి మంజూరైన రూ.3 లక్షల శ్రీనిధి సొమ్మును కూడా వాడేసుకోవడంతో ఆ గ్రూప్ సభ్యులు మెప్మా అధికారులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటకి వచ్చింది. దీంతో పలువురు గ్రూప్ సభ్యులు కూడా తమకు జరిగిన అన్యాయంపై వరుసపెట్టి ఫిర్యాదులు చేశారు. దీంతో ఆర్పీ భాగ్యలక్ష్మి పరిధిలో ఉన్న 28 సంఘాల అకౌంట్లకు ఆడిట్ నిర్వహించారు. ఈ తంతు ఏడాది పాటు సాగింది. చివరగా మొత్తం 13 సంఘాలకు చెందిన రూ.14.18 లక్షల నగదు స్వాహా చేసినట్లు తేలింది. దీంతో గత ఏడాది ఆర్పీ భాగ్యలక్ష్మిని తాత్కాలికంగా విధుల నుంచి తప్పించారు. అయితే ఆమె స్వాహా చేసిన నగదును తిరిగి రాబట్టడంలో మాత్రం మెప్మా అధికారులు విఫలమయ్యారు. ఇటీవల బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను చెల్లించాలని నోటీసులు వస్తుండడంతో బాధిత మహిళలు న్యాయం చేయాలని శనివారం పుత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పుత్తూరు పోలీసు స్టేషన్ వద్ద బాధిత డ్వాక్రా మహిళలు

లోపభుయిష్టం మెప్మా పనితీరు

ఒక ఆర్పీ డ్వాక్రా సంఘాల నగదును రూ.లక్షల్లో స్వాహా చేస్తున్నా పసిగట్టలేని స్థితిలో పుత్తూరు మెప్మా అధికారులు ఉండడంపై తీవ్రస్థాయిలో విమర్శలు తలెత్తుతున్నాయి. నాలుగేళ్ల కిత్రమే బయటపడినా సమస్యను మసిపూసి మారేడుకాయ చేయాలనే ప్రయత్నం చేశారు తప్ప తమకు న్యాయం చేయాలనే ఆలోచన మెప్మా అధికారులకు లేకుండాపోయిందని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించినా మెప్మా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేకపోయారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. తమ నగదును తిరిగి ఇప్పించడంతో మెప్మాతో పాటు మున్సిపల్ అధికారులు కూడా బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా పుత్తూరు మెప్మాలో గూడుకట్టుకున్న నిర్లక్ష్యపు జాడ్యాన్ని వదిలించి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తేగానీ వ్యవస్థ గాడిన పడదనే మాటలు వినిపిస్తున్నాయి.

జ్వరాలతో పడకేసిన తోటకనుమ

విష జ్వరంతో వివాహిత మృతి - చిన్నారి పరిస్థితి విషమం - ఇంటింటా డెంగ్యూ జ్వర బాధితులు



గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

వి.కోట, జూలై 6: వి.కోట మండలంలోని తోటకనుమ గ్రామం జ్వరాలతో పడకేసింది. వారం రోజులుగా పల్లెలో ఇంటికొకరు చొప్పున జ్వరం బారినపడ్డారు. నాలుగు రోజుల క్రితం గంగరాజు కుమార్తె (8నెలలు) జ్వరం తీవ్రం కావడంతో చిన్నారిని కుప్పంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చిన్నారితో పాటు ఉంటున్న తల్లి స్వాతి (20) డెంగ్యూ బారినపడింది. పరిస్థితి విషమించడంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. చిన్నారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.



తాగునీటి ట్యాంకు వద్ద మురుగునీటి గుంత

లోపించిన పారిశుధ్యం: గ్రామంలో తాగునీటి ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. అక్కడే తాగునీటి పైప్‌లైన్ లీకేజీకి గురై మురుగునీటి గుంతలు ఏర్పడ్డాయి. మురుగునీరు తాగునీటి పైపులైన్‌లో కలుస్తోంది. ఆ నీరు తాగి జ్వరాలు ప్రబలినట్లు తెలుస్తోంది. ఇక పల్లెలో చెత్త పేరుకుపోయింది. పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపానపోలేదని గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

వివాహిత మృతిపై విచారణ

జ్వరంతో వివాహిత మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎంపీడీవో గోవర్ధన్ గ్రామంలో విచారణ చేపట్టారు. ఇంటింటా జ్వరాలపై ఏఎన్‌ఎంలు, ఇతర ఆరోగ్య సిబ్బంది సర్వే చేపట్టారు. ఓగు పీహెచ్‌సీ వైద్యులు విజయ్ నేతృత్వంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా పది మందికి జ్వరాలు ఉన్నట్లు నిర్ధారించారు. గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీవో ఆదేశించారు.



జ్వరంతో మృతి చెందిన వివాహిత

అక్రమ వ్యాపారాలకు విజయానందరెడ్డి కింగ్ పిన్

● వైసీపీ కార్పొరేటర్లు అలీ, కుట్టి రాయల్



మాట్లాడుతున్న కార్పొరేటర్లు అలీ, కుట్టి

చిత్తూరు సిటీ, జూలై 6: వైసీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్చార్జ్ విజయానందరెడ్డి రాజకీయ సన్యాసం తీసుకుంటే మంచిదని ఆ పార్టీ కార్పొరేటర్లు హుస్సేన్ అలీషీ (అలీ, 36వ డివిజన్), కుట్టి రాయల్ (19వ డివిజన్) పేర్కొన్నారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి అంకిత భావంతో పనిచేస్తున్నామన్నారు. ఎలాంటి ఆరోపణలూ లేకుండా పనిచేస్తున్న మమ్మల్ని ఎందుకు సస్పెండ్ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. చిత్తూరులో జరిగే అన్ని అక్రమ వ్యాపారాలకు విజయానందరెడ్డే కింగ్ పిన్ అని ఆరోపించారు. సర్పంచ్‌గా కూడా గెలవని విజయానందరెడ్డికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే ఇలాగే ఉంటుందని ఎద్దేవా చేశారు. వైసీపీ కార్యకర్తలపై దాడులు జరిగితే తాను అండగా ఉంటానని మీడియా ముందు చెబుతారని, ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్‌లో ఉంటుందని చెప్పారు. వైసీపీ అధిష్ఠానం విజయానంద రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే తప్ప చిత్తూరు పార్లమెంటు పరిధిలోని గంగాధర నెల్లూరు, పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గ వైసీపీ క్యాడర్ పార్టీలో నిలిచే పరిస్థితిలేదని అన్నారు.

25 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 6: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. గడచిన 24 గంటల్లో 25 మండలాల్లో మోస్తరు వర్షం నమోదైంది. అత్యధికంగా రొంపిచెర్లలో 33.6మి.మీ, అత్యల్పంగా చిత్తూరు రూరల్‌లో 1 మి.మీ వర్షపాతం నమోదైంది. గంగవరంలో 31.4, తవణంపల్లె 23.2 కార్వేటినగరం 20.2, పులిచెర్ల 20, నగరి 17.8, సోమల, పలమనేరు 14.6, విజయపురం 13.2, పూతలపట్టు 12.6, ఎస్ఆర్ పురం 11.8, వెదురుకుప్పం 9.2, జీడీ నెల్లూరు 8.2, ఐరాల, చిత్తూరు అర్బన్ 7.2, సదుం 5, బంగారుపాళ్యం 5, నింద్ర, చౌడేపల్లె 4.2, పెద్దపంజాణి 2.4, పుంగనూరు 2.2, యాదమరి, పెనుమూరు 2, పాలసముద్రం 1.2 మి.మీ చొప్పున వర్షం కురిసింది.

టీటీడీ నిర్ణయించిన ధరలకే విక్రయించాలి : ఈవో

తిరుమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు టీటీడీ నిర్ణయించిన ధరలకే వస్తువులను దుకాణదారులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో శ్యామలరావు శనివారం ఓ ప్రకటన ద్వారా హెచ్చరించారు. టీటీడీ ఈవో ఆదేశాల మేరకు జేఈవో వీరబ్రహ్మం పర్యవేక్షణలో శనివారం టీటీడీ ఉద్యోగులు భక్తుల తరహాలో శ్రీవారి మెట్టు వద్దనున్న షాప్ నెంబరు3లో గాజు సీసా నీటి బాటిల్ రూ.50 కొనుగోలు చేశారు. అనంతరం ఖాళీ గ్లాస్ బాటిల్ తిరిగి షాపు యజమానికి ఇవ్వగా.. రూ.20 తిరిగి వెనుకకు ఇచ్చారు. వాస్తవంగా రూ.30 తిరిగి ఇవ్వాలి. ఈక్రమంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు తేలింది. అలాగే వీరు కొనుగోలు చేసిన దుకాణం ముందు నాణ్యత కలిగిన ప్లాస్టిక్ బాటిల్స్ కూడా నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నట్టు గమనించారు. గతంలో కూడా ఈ షాపు యజమాని వినోద్‌కుమార్ టీటీడీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటంతో అతడికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, రూ.25 వేలు జరిమానా విధించి హెచ్చరించారు. అయినప్పటికీ అతడు తన ధోరణిని మార్చుకోలేదని, ధరల పట్టిక ప్రదర్శించడం లేదని అధికారులు నివేదిక అందజేశారు. ఈనేపథ్యంలో మరోసారి టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాన్ని సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఎర్నెస్ట్ మనీ డిపాజిట్(ఈఎండీ), సెక్యూరిటీ డిపాజిట్(ఎస్‌డీ)లు కూడా జప్తు కాబడతాయని అధికారులు స్పష్టం చేశారు. టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా దుకాణదారులు వస్తువులను భక్తులకు అధిక ధరలకు విక్రయించి మోసం చేస్తే, టీటీడీ టెండర్ నిబంధనలను అతిక్రమించినట్టు తెలిస్తే ఆ దుకాణ లైసెన్స్‌ను రద్దు చేస్తామని టీటీడీ హెచ్చరించింది.

టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి

తిరుమల హెల్త్‌ఆఫీసర్‌గా సునీల్‌కుమార్

తిరుమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి నియమితులయ్యారు.ప్రస్తుతం ఎస్టేట్ ఆఫీసర్‌గా ఉన్న మల్లిఖార్జున పరకామణి ప్రత్యేకాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలో అయన్ను పరకామణికి పరిమితం చేశారు.రిటైర్డ్ అధికారిని ఎస్టేట్ ఆఫీసర్ స్థానంలో కొనసాగిస్తున్నారనే విమర్శలొచ్చిన నేపథ్యంలో ఆయన స్థానంలో తిరుపతిలోని శ్వేతలో విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మిని నియమించారు. తిరుమల హెల్త్‌ఆఫీసర్‌గా ఉన్న శ్రీదేవి స్థానంలో తిరుపతిలో అదనపు హెల్త్‌ఆఫీసర్‌గా ఉన్న సునీల్‌కుమార్‌ను నియమించారు. ఇటీవల తిరుమలలో పారిశుధ్య వైఫల్యంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. టీటీడీ ఈవో శ్యామలరావు కూడా తనిఖీల్లో పారిశుధ్య లోపాన్ని గుర్తించి ఓ అధికారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తరచూ పరిశుభ్రతపై విమర్శలు వస్తున్న క్రమంలో హెల్త్‌ఆఫీసర్‌గా ఉన్న శ్రీదేవి కూడా బదిలీకోసం వినతిపత్రాన్ని అందజేశారని, ఈ క్రమంలో ఈవో అమోదం తెలపడంతో సునీల్‌కుమార్‌ను నియమించినట్టు సమాచారం.

ప్రభుత్వ స్థలం పరిరక్షణకు చర్యలు

● తదుపరి ఆదేశాలు వచ్చే వరకు రెవెన్యూ సిబ్బంది కాపలా ● ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ సీపీఐ ధర్నా


నిర్మాణం జరగకుండా విధులు నిర్వర్తిస్తున్న రెవెన్యూ సిబ్బంది


అక్రమ కట్టడం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ములకలచెరువు, జూలై 6: ములకలచెరువు మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్దనున్న ప్రభుత్వ స్థలం పరిరక్షణకు రెవెన్యూ అధికారులు చర్యలు ప్రారంభించారు. రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడంగా భావిస్తున్న ఇంటి నిర్మాణం పనులు జరగకుండా ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం నుంచి పనులు జరగకుండా ప్రభుత్వ భూమిలో రెవెన్యూ సిబ్బంది కాపలా కాస్తున్నారు. పనులు ఆపేందుకు అక్కడే విధులు నిర్వర్తిస్తూ తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఇంటి నిర్మాణం పనులు జరగకుండా చర్యలు చేపట్టారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ప్రహరీ ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలం విషయమై తీవ్ర వివాదం తలెత్తింది. ఇక్కడ తనకు పట్టా ఇచ్చారని ఓ మహిళ ఇంటి నిర్మాణం చేపట్టిన విషయం విదితమే. అయితే ప్రభుత్వ స్థలంలో ఎవరికి పట్టాలు జారీ చేయలేదని అది అక్రమ కట్టడమని, ఆ అక్రమ కట్టడాన్ని తొలగించాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ సెక్షన్ -7 కింద నోటీసులు జారీ చేశారు. గత నెల 22వతేదీన జారీ చేసిన నోటీసు గడువు శనివారం నాటితో ముగిసింది. దీనికి తోడు ప్రభుత్వ భూమిని పరిరక్షించి అక్రమ కట్టడాన్ని తొలగించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నాయకులు, కార్యకర్తలు రెవెన్యూ అధికారులకు వినతి ప్రతం ఇచ్చారు. దీంతో రెవెన్యూ అధికారులు తదుపరి చర్యలకు శ్రీకారం చుట్టారు. ఉదయం ఇంటి నిర్మాణ పనులు జరుగుతుండడంతో అడ్డుతగిలారు. తదుపరి చర్యలు తీసుకునే వరకు పనులు జరగకుండా చూసేందుకు వీఆర్‌వోలు, వీఆర్‌ఏలకు సోమవారం వరకు పగలు, రాత్రి డ్యూటీలు వేశారు. దీంతో రెవెన్యూ సిబ్బంది పనులు జరగకుండా ప్రత్యేక విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని సీపీఐ ధర్నా

ములకలచెరువు ఎంపీడీవో కార్యాలయం వద్దనున్న ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని శనివారం సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. అక్రమ కట్టడంగా భావిస్తున్న ఇంటి నిర్మాణం ఎదుట నిరసనకు దిగారు. అక్రమ కట్టడాన్ని తొలగించి రెవెన్యూ అధికారులు స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్ర అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, నాయకులు నారాయణస్వామి, వేమనారాయణ, ఉత్తన్న, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేయండి


మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మాజీసర్పంచి పఠాన్ ఖాదర్‌ఖాన్, తదితరులు

మదనపల్లె/టౌన్, జూలై 5: మదనపల్లె నియోజకవర్గంలో ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం టీడీపీ నాయకులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ సెక్రటరి, పోతబోలు మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌ఖాన్ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాదరెడ్డికి విన్నవించారు. శనివారం రాయచోటికి వచ్చిన మంత్రిని మదనపల్లె టీడీపీ మైనారిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వైసీపీ పాలనలో తాము ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. అలాగే మదనపల్లె అభివృద్ధికి సహకరించాలని కోరారు. టీడీపీ నాయకులు మహబూబ్‌ఖాన్, అయూబ్‌బాషా, కొత్తిండ్లు బావాజాన్, చంటి, శివకుమార్ వున్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

మదనపల్లె టౌన్, జూలై 6: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. శనివారం చైతన్య హైస్కూల్ మొదటి బ్రాంచిలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో చైతన్య హైస్కూల్ రీజినల్ ఇన్చార్జి పి.శ్రీధర్, ఏజీఎం సురేష్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, డీన్ నూర్, వెంకటేశ్, ఏవో రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి

వాల్మీకిపురం, జూలై 6: గ్రామాల్లో పారిశుధ్య పనులు మరింత మెరుగు పరిచే దిశగా చర్యలు తీసుకోవాలని డీపీవో ధనలక్ష్మి ఆదేశించారు. శని వారం వాల్మీకిపురం గ్రామ పంచాయతీలో ఆమె విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తూ డంపింగ్‌యార్డు పనులను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తూ స్థానిక అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాదుల దృష్ట్యా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ పరిధిలో పన్నుల వసూలు వేగవంతం చేయాలన్నారు. పంచాయతీ ఈవో ఉదయ్‌కుమార్, సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో సీఆర్‌పీ మృతి

తంబళ్లపల్లె, జూలై 6: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె సీఆర్‌పీ(క్లస్టర్ రీసో ర్స్ పర్సన్) టి.చంద్రశేఖర్(52) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మదనపల్లెకు చెందిన చంద్రశేఖర్ తంబళ్లపల్లె మండల విద్యాశాఖ కార్యాలయంలో కోసువారిపల్లె సీఆర్‌పీగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం మదనపల్లె హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలకు నిర్వహిస్తున్న టీచర్ టూల్ ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమానికి హాజరై గొంతులో నొప్పిగా ఉందని అధికారుల అనుమతితో మధ్యలోనే ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం కుటుంబసభ్యులను తీసుకుని వైద్య చికిత్సల కోసం మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా అక్కడ గుండెపోటుకు గురై మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న సీఆర్‌పీల రాష్ట్ర అధ్యక్షుడు గోవ ర్ధన్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, సీఎంవో కరుణాకర్, తంబళ్లపల్లె ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, తోటి సిబ్బంది భౌతికకాయాన్ని సంద ర్శించి నివాళు లర్పించారు. సీఆర్‌పీల సంఘం, ఉపాధ్యాయుల సంఘం, అధికారులు కలసి రూ.1.5లక్షలకు పైగా మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేశారు. మృతుడికి భార్య భారతి, ఇద్దరు కుమార్తెలు నిఖిత, సంగీత ఉన్నారు. ప్రభుత్వం వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

రెడ్డెమ్మ హుండీ ఆదాయం రూ.7 లక్షలు

గుర్రంకొండ, జూలై 6:గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారి హుండీని దేవాదాయశాఖ అధికారులు శనివారం లెక్కించగా అమ్మవారికి రూ.7,03,377 నగదు, 40 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండీ వచ్చిందన్నారు. ఈ మొత్తాన్ని ఆలయాభివృద్ధికి వినియోగిస్తామని ఈవో మంజుల తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖాధికారి రవి కిరణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ములకలచెరువు, జూలై 5: మండలంలోని పెద్దపాళ్యం పంచాయతీ రామానాయునికోటలో శనివారం తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాధ్ ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి జేఈ నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ రమేష్‌నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ షాహీనా, జనసేన నాయకులు మోహన, ఆదినారాయణ, రెడ్డికుమార్, మురళి, శివ తదితరులు పాల్గొన్నారు.

పోటా పోటీగా కబ్జా ప్రయత్నాలు

బి.కొత్తకోట, జూలై6: బి.కొత్తకోటలో ప్రభుత్వభూమి కబ్జాలు పోటాపోటీగా సాగుతున్నాయి. నగరపంచాయతీ పరిధిలో స్థలం సునాయాసంగా కొట్టేయాలన్నా, కబ్జా చేయాలన్నా, అందరికీ గుర్తు వచ్చేది పెయింటర్స్ కాలనీ. ఎప్పుడో బి.కొత్తకోట మండలం మదనపల్లె నియోజకవర్గంలో భాగంగా వున్నప్పుడు సీపీఐ నాయకుల పోరాట ఫలితంగా పట్టణశివారు బీరంగి పంచాయతీ సర్వేనంబరు 58-2 లో ఎర్పడిన ఈ పెయింటర్స్ కాలనీలో కార్మికుల కోసం ఇళ్లస్థలాలను కేటాయించారు. పోగా మిగిలిన స్థలం రిజర్వులో ఉంచారు. కమ్యూనిటీ పర్పస్ కింద మరికొంత స్థలాన్ని కేటాయించారు. కాలక్రమేణా రిజర్వు స్థలం కబ్జాకు గురవుతూ వచ్చింది. కమ్యూనిటీ స్థలం మాత్రం మిగిలింది. ఈ స్థలం అత్యంత విలువైనది కావడంతో ప్రస్తుతం రెండువర్గాల మధ్య కబ్జాల కోసం ఆధిపత్య పోరు నడుస్తోంది. కమ్యూనిటీ స్థలం మాదం టే...మాదంటూ పోరుకు దిగారు. ఒకే ప్లాటుకు రెండేసి పట్టాలు ఉండటంతో ఓ వర్గం చదును చేయిస్తే, మరో వర్గ పునాదులు తవ్వుతోంది. తాజాగా శుక్రవారం ఓ వర్గం ఎక్స్‌కవేటర్‌తో చదును చేయగా, శనివారం మరో వర్గం పునాదులు వేసింది. చివరకు ఏమి జరుగుతుందో వేచిచూడాలి.

పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు

కలకడ, జూలై 6:మండలంలోని బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి విశేష పూజలను చేశారు. ఈ సందర్భంగా వేకువ జామునే స్వామి వారికి అభిషేకం, ఆకుపూజ కార్యక్రమాలను పూజారి రామయ్య నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ములకలచెరువులో: మండలంలోని దేవళచెరువు సమీపంలో వెలసిన వీరాంజనేయస్వామి వారి తిరుణాల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు జరిగిన హోమాల్లో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం, జూలై 6: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభి రామాలయంలో శనివారం శ్రీరామచంద్రుల వారి జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రం పురస్కరించుకుని సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయాత్పూర్వం సుప్రభాత సేవ మొదలకుని ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం నూతన వధూవరులైన సీతారామలక్ష్మణులకు విశేషాలంకరణలు గావించి ఆలయ మండపంలో పుష్పాలంకరణలతో తీర్చిన కళ్యాణ వేదికపై ఆశీనులు గావించారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణలు, విశేష భక్తజనం నడుమ సీతారాముల కల్యాణమహోత్సవ వేడుకలు కమనీయంగా సాగాయి. చివరగా హోమాదికార్యక్రమాలు పూర్ణాహుతి గావించి కల్యాణంలో పాల్గొన్న దంపతులు, భక్తులకు టీటీడీ పట్టువస్త్రాలు, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిలో అలంకరణలు గావించి పురవీధుల గుండా నగరోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణరాజుభట్టార్, అనీల్‌కుమార్, భాషికాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జూనోసిస్ వ్యాధుల పట్ల అవగాహన ఉండాలి


పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న ఏడీ సుమిత్ర

తంబళ్లపల్లె, జూలై 6: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాదులను జూనోసిస్ వ్యాదుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్థక శాఖ ఏడీ సుమిత్ర సూచించారు. శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్య కేంద్రంలో జూనోసిస్ వ్యాదుల సంక్రమణ, నివారణ చర్యలు, తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 30 పెంపుడు కుక్కలకు యాంటీరేబీస్ టీకాలను వేశారు. ముఖ్యంగా ఇళ్లలో పెంచుకునే పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా యాంటి రేబీస్ టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కలిచెర్ల లో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబీస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండ పెంపుడు కుక్కలకు రేబీస్ నిరోధన టీకాలు వేయించాలన్నారు.

కలికిరిలో: వివిధ రకాల జంతువుల నుంచి సంక్రమించే వ్యాదులు మనుషులకు ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయని కలికిరి పశు సంవర్ధక ప్రాంతీయ వైద్యశాల ఏడీ కె. వెంకటముని నాయుడు పేర్కొన్నారు. పెంపుడు జంతువుల విషయంలో కూడా అనేక జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. శనివారం ప్రపంచ జూనోసిస్ దినం సందర్భంగా కలికిరి, మేడికుర్తి, పాలెం గ్రామాల్లో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండలం చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో జంతువుల ద్వారా మనుషలకు వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ జంతువుల నుంచి మానవులకు వ్యాప్తి చెందు వైరస్ వ్యాధులు రేబీస్, స్వైన్‌ఫ్లూ, బర్డ్‌ఫ్లూ పట్ల జాగ్రత్తలు, తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరి వైద్యాధికారిణి అనూష, డాక్టర్ జులేఖాబేగం, సీహెచ్‌వో ఇందిరారాణి, హెల్త్ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, సూపర్‌వైజర్లు సుధాకర్, భానుబీ, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో మార్పులకు ఆద్యుడు జగ్జీవన్‌రామ్


జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పీలేరు, జూలై 6: దేశంలోని వ్యవసాయ రంగంలోని మార్పులకు బాబు జగ్జీవన్ రామ్ ఆద్యుడని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డ రామకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఎంఆర్‌పీఎస్, మాలమహానాడు ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం బాబు జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాదిగ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, రైల్వే మంత్రిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన బాబు జగ్జీవన్ రామ్, వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తిని నేటి దళిత విద్యార్థులు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. పీలేరులోని కోటపల్లె క్రాస్, మోడల్ కాలనీల్లో వేర్వేరుగా జరిగిన వర్ధంతి వేడుకల్లో ఎంఆర్‌పీఎస్ నాయకుల గండికోట వెంకటేష్, చరణ్‌కుమార్, హుస్సేనయ్య, నాగరాజ, తాతయ్య, మాజీ జడ్పీటీసీ కుమార్, సుధాకర్ బాబు, ముల్లంగి చంద్రయ్య, జగదీశ్, నవీన్ కుమార్, తిమ్మయ్య, ప్రసాద్, శ్రీకాంత్, రామాంజులు, రమణ, మల్లికార్జున పాల్గొన్నారు.

అధికారులు అవినీతికి దూరంగా ఉండాలి

●గుర్రంకొండ పంచాయతీ అక్రమాలపై విచారణ చేయిస్తాం ●ఎమ్మెల్యే కిశోర్


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

గుర్రంకొండ, జూలై 6:అవినీతి, అక్రమాలకు అధికారులందరూ దూరంగా ఉండాలని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. గుర్రంకొండ ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో శనివారం సమీక్షా సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనర్హులకు ప్రభుత్వ పథకాలు చేరేలా అధికారులు పని చేశారని, దీంతో అర్హులు నష్టపోయారన్నారు. గతంలో చేసిన తప్పులనే మళ్లీ చేయకుండా పేదలకు న్యాయం చేయాలని చెప్పారు. నియోజకవర్గంలోని పీలేరు గ్రామ పంచాయితీలో రూ.3 కోట్ల అవినీతి, అక్రమాలు జరిగాయని అధికారులకు తెలిపారు. అలాగే గుర్రంకొండ, వాల్మీకీపురం మేజర్ పంచాయతీ నిధులున్న చిన్న చిన్న పనులను కూడా అధికారులు చేయలేదన్నారు. గుర్రంకొండ పట్టణంలో ఎక్కడ చూసిన పారిశుధ్యం లోపించిందన్నారు. గుర్రంకొండ పంచాయతీలో అవినీతి, అక్రమాలు జరిగి నట్లు తమ దృష్టికి వచ్చిందని వాటిపై సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు. పీలేరు ఎమ్మెల్యేగా గెలిచి మొదటి సారి గుర్రంకొండకు విచ్చేసిన ఆయనకు ప్రజలు, నాయకులు బ్రహ్మరథం పట్టి మార్కెట్ యార్డు నుంచి భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చేసిన అన్యాయాలు, అక్రమాలే నేడు సొంత నియోజకవర్గంలో వారు తిరగలేని పరిస్థితి తెచ్చిపెట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌కుమార్, మూర్తిరావు, ప్రసాద్‌నాయుడు, నౌషాద్ అహ్మద్, హరిప్రసాద్‌నాయుడు, ఏజాజ్ అహ్మద్, ఎల్లుట్ల మురళీ, చలమారెడ్డి, సుంకర శేఖర్, బయ్యారెడ్డి, మహాత్మారెడ్డి, చంద్రబాబు, ప్రదీప్, నాగేంద్ర, జయసూరి, జ్యోతిరెడ్డి, నరసింహులు, ఆనంద్, సుబ్బరాజు, వెంకటకృష్ణారెడ్డి, రావీష్, ఆది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణదారులకు ఉచిత ఇసుక అందేలా చూడండి

ములకలచెరువు, జూలై 5: ఇళ్ల నిర్మాణదారులకు ఉచిత ఇసుక అందేలా చూడాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం తంబళ్లపల్లె మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సోమవారం నుంచే చంద్రబాబునాయుడు ఇళ్ల నిర్మాణదారులకు ఉచితంగా ఇసుకను అందిస్తారన్నారు. వైసీపీ శ్రేణులు ఇష్టం వచ్చినట్లు ఇసుకను విక్రయించి కోట్లు ఆర్జించారని విమర్శించారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, రెడ్డెప్పరెడ్డి, నేతలు బేరీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుట్ట ఆక్రమణను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు


గుట్ట చదును పనులు అడ్డుకున్న తహసీల్దారు మహబూబ్ బాషా

పీలేరు, జూలై 6: ప్రభుత్వ భూమిలోని గుట్ట ఆక్రమణను శనివారం పీలేరు రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ దిగువ యల్లంపల్లె సమీపంలోని గుట్టను శనివారం ఉదయం కొంత మంది అక్రమార్కులు యంత్రాలతో చదును చేసి ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన కొందరు గ్రామస్థులు అటు అధికారులు, ఇటు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి తెలియజేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆక్రమణలను అడ్డుకోవాలని తహసీల్దారు మహబూబ్‌బాషాను ఆదేశించారు. తహసీల్దారు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఆక్రమణ యత్నాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వ భూముల జోలికి వచ్చే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తహసీల్దారు స్పష్టం చేశారు. ఆక్రమణల విషయం తెలిసిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని పలువురు అభినందించారు.

విద్యా ప్రవేశంపై ఉపాధ్యాయులకు అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంఈవో నారాయణ

పెద్దతిప్పసముద్రం జూలై 6 : మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు విద్యా ప్రవేశం కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. స్థానిక మోడల్ స్కూల్లో మండల ఎంఈవోలు నారాయణ, గౌస్‌పీర్‌లు 2024-25 విద్యా సంవత్సరానికి సంబందిచిన విద్యా ప్రవేశంపై ఆయా పాఠశాలల హెచ్ఎం, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం పోషణను మెనూ ప్రకారం తప్పని సరిగా విద్యార్థులకు అందేలా ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 70 పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించడానికి యూపీఐ వాడొద్దు


మదనపల్లె టౌన్, జూలై 6: గృహ, పరిశ్రమల విద్యుత్ బిల్లులు చెల్లించడానికి ఇకమీదట యూపీఐ సర్వీసులైన ఫోన్ పే, పేటీఎం గూగుల్ పే, అమెజాన్, బ్యాంకుల సర్వీసులను వాడకూడదని మదనపల్లె ఎస్పీడీసీఎల్ ఈఈ యుగంధర్ తెలిపారు. ఆర్‌బీఐ ఆదేశాల ప్రకారం యూపీఐ సర్వీసులు నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు నేటి నుంచి ఏపీ ఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా కాని డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌పీడీసీఎల్.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా కాని, నిర్దేశించిన క్యూఆర్ కోడ్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలన్నారు.

క్షేత్ర దినోత్సవాల నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలి


మామిడి రకాలను పరిశీలిస్తున్న ఎన్జీ రంగా వర్సిటీ విస్తరణ సంచాలకులు

కలికిరి, జూలై 6: కేవీకేలో క్షేత్ర దినోత్సవాలు, ప్రథమ శ్రేణి ప్రదర్శనలకు ప్రాధాన్య మివ్వాలని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.ప్రమీళా రాణి, విస్తరణ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.ముకుంద రావులు సూచించారు. శనివారం కలికిరి కేవీకేలో జరుగుతున్న పలు కార్యక్రమాలను పరిశీలించారు. వేరుశనగ విత్తనోత్పత్తి, పది రకాల వేరుశనగ క్షేత్రం, సమగ్ర కోళ్ల, గొర్రెల పెంపం, వర్మీ కంపోస్టు, నర్సరీలో పెంచుతున్న మామిడి అంటు మొక్కలు, అజోల్లా పెంపకం తదితర వాటిని సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్తలతో మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు అవగాహన కల్పించాలని సూచించారు. అదే విధంగా పండు ఈగ బుట్టలు, మామిడి ఫ్రూట్ కవర్లు రైతులకు అందుబాటులో వుంచాలని ఆదేశించారు. కేవీకే కోఆర్డినేటర్ పాండురంగా, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పాడి పశువుల్లో వచ్చే వ్యాధులకు ఉచిత టీకాలు


పాడి పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

నిమ్మనపల్లి, జూలై 6: మండలంలోని పాడి పశువులకు వచ్చే మూర్ఛ, ముద్ద చర్మవ్యాధికి సంభందించిన టీకాలను గత మూడు రోజుగా అన్ని గ్రామాలలోని పశువులకు ఉచితంగా వేస్తున్నట్లు పశు వైద్యాధికారి సురేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సర్వసాధారణంగా పశువులకు ఈ లక్షణాలు వస్తే జ్వరం, కాళ్ల వద్ద పుండ్లు రావడంతో పశువులు మేపు తినకుండా పోతాయన్నారు. వాటిని నివారించేందుకు ఏడాదికి రెండు సార్లు "టీకాలను ఖచ్చితంగా వేయించాలని తెలిపారు. మొదట విడతగా మండలానికి 8500ల టీకాలు రాగా వాటిలో ఇప్పటి వరకు 2500టీకాలును పశువులకు వేసినట్లు తెలిపారు. మిగిలిన టీకాలను కూడా వేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి పాడి రైతు తప్పకుండా టీకాలను వేయించాలని తెలిపారు.

ఒప్పంద అధ్యాపకుల రెన్యూవల్‌కు దరఖాస్తులు

పీలేరు, జూలై 6: అన్నమయ్య జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు 2024-25 విద్యాసంవత్సరానికి తమ సర్వీసును రెన్యూవల్ చేసుకోవాలని అన్నమయ్య జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల ద్వారా ఈ నెల 8వ తేదీలోపు తమ కళాశాలలో అందజేయాలని ఆయన తెలిపారు.

రేపు గ్రామపంచాయతీలో బహిరంగ వేలం

పెద్దతిప్పసముద్రం జూలై 6 : పెద్దతిప్పసముద్రం గ్రామ పంచాయతీకి చెందిన వారపు సంత, బస్టాండు గేటు, జంతు మాంస విక్రయశాలల రుసుములు వసూలు చేసుకొనుటకు సోమవారం(8న) ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మదనపల్లె డివిజనల్ పంచాయతీ అధికారి, గ్రామ పంచాయతీ సర్పంచ్, ఆద్వర్యంలో నిర్వహించనున్న వేలంలో పాల్గొనదలచినవారు వారపు సంతకు రూ. 10 వేలు, బస్టాండు గేటు రూ. 10వేలు, జంతు మాంస విక్రయ శాలకు రూ. 5వేలు ధరావత్తు చెల్లించి పాల్గొన వచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 7981878954 సంప్రదించాలని కోరారు.